
ఆంధ్రజ్యోతి



పోటాపోటీగా బారాషహీద్ దర్గా వేలం

● రూ.1.30 కోట్లకు దక్కించుకున్న ముజామిల్

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బారాషహీద్ దర్గా నిర్వహణ వేలం పాటలు మంగళవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో పోటాపోటీగా జరిగాయి. ముజామిల్ అహ్మద్, టీడీపీ నాయకుడు సాబీర్‌ఖాన్ పోటీ పడ్డారు. చివరకు రూ.1,30,05,500లకు ముజామిల్ అహ్మద్ దర్గా నిర్వహణను దక్కించుకున్నారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి రొట్టెల పండుగ ప్రారంభం నుంచి ఏడాది కాలంపాటు దర్గా నిర్వహణ, మైదానంలో అద్దెల వసూళ్ల హక్కును పాటదారుడు పొందుతారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు అధికారులు పర్యవేక్షించారు.



ధ్వజస్తంభానికి కొడిగుడ్డను కడుతున్న పూజారులు

సకల దేవతల్లారా రారండి!

రామతీర్థంలో వేడుకగా ధ్వజారోహణం

శేషవాహనంపై ఆదిదంపతుల వైభోగం

విడవలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో తొలి ఘట్టం ధ్వజారోహణ కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత గణపతి పూజ, పుణ్యావాహచన, ధ్వజపీట తదితర ప్రత్యేక పూజలను ఆలయ పూజారులు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నందీశ్వరుడి చిత్రాన్ని ముద్రించిన నూతన వస్త్రాన్ని ధ్వజ స్తంభానికి కట్టి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం పైకి ఎగరేశారు. సంతానం లేని మహిళలకు కొడి ముద్దలను పంచిపెట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, ఈవో మల్లికార్జున రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి శేషవాహనంపై ఆదిదంపతులు కొలువుదీరి భక్తులను కటాక్షించారు. స్వామివారం వాహనం ముందు భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడపాలశ్రీదర్‌రెడ్డి, ఆవుల వాసు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తాతా రమేష్, పొన్నాడి చంద్రశేఖర్, ఆవుల రవిచంద్ర ఆలయ గుమస్తా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



● నేడు అమ్మవారి కల్యాణం, ప్రధానోత్సవం

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 17(ఆంధ్రజ్యోతి): నర్రవాడలోని శ్రీవెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పేరంటాలమ్మ, గురవయ్యానాయుడు దంపతులు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సంతానంలేని మహిళలు ఉపవాసదీక్షతో వెంగమాంబ పేరంటాలను వరపడి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయం నుంచి నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవారిపాళెం, బీసీ కాలనీల మీదుగా గ్రామోత్సవం సాగింది. తొలుత నర్రవాడలో ఉత్సవ విగ్రహాలకు వెంగమాంబ వంశీయులు వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం చేయించారు. స్వామివార్లకు పులివర్తి వంశీయులు పట్టువస్త్రాలను సమర్పించారు. గ్రామోత్సవంలో అమ్మవారి వాహనం వెంట మహిళలు వారుకడవతో నీరు పోసి కాయాకర్పూరం అందచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా బుధవారం వెంగమాంబ దంపతుల కల్యాణం, రాత్రికి ప్రధానోత్సవం జరగనుంది. ఉత్సవాల్లో ప్రధాన రోజులైన బుధ, గురువారాల్లో భారీసంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కావలి డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, స్పెషల్, ఏఆర్ పార్టీ పోలీసులతో కలిపి సుమారు 400 మంది బందోబస్తు విధుల్లో ఉంటారు.


సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల

పంపిణీ రేపు

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను గురువారం పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని, రైతులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి మంగళవారం 93 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాంలో ప్రస్తుతం 37.180 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



విద్యాహక్కు చట్టం అడ్మిషన్లు చేపట్టాలని తల్లిదండ్రుల తరపున పాఠశాల నిర్వాహకులకు వినతిపత్రం ఇస్తున్న సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు

ప్రకటనలేనా...

అమలుందా!?

● లోపభూయిష్టంగా విద్యాహక్కు చట్టం నిర్వహణ ● నామమాత్రంగా ఉచిత సీట్ల కేటాయింపు

● కేటాయించింది 576.. ప్రవేశాలు 293 ● అడ్మిషన్లు తీసుకున్న వారిపై యాజమాన్యాల ఒత్తిళ్లు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నిర్వహణలో లోపాలను సరిదిద్దేందుకు, తప్పులను ఎత్తి చూపేందుకు రూపుదిద్దుకున్న విద్యాహక్కు చట్టం ఏళ్లు గడుస్తున్నా సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. విద్యను బాలల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ విద్యాహక్కు చట్టం చేశారు. ఉపాధిహామీ పథకం, సమాచారహక్కు చట్టాల తరహాలో ఇది అమలవ్వాలి. 6-14 సంవత్సరాల వయసు కలిగిన బాలలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో చేరి చదువుకునేలా చర్యలు తీసుకుని వారికి ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని ఈ చట్టం చెబుతోంది. పాఠశాలల్లో చేరని, లేదా మధ్యలో చదువు మానేసిన వీరందరినీ తిరిగి చదువుల బాట పట్టించడం విద్యాహక్కు చట్టం ముఖ్య ఉద్దేశం. అయితే ఈ చట్టం మాత్రం ఎక్కడా అమలు కావడం లేదు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు కల్పించాల్సిన 25శాతం సీట్లను కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిరాకరిస్తున్నారు. జిల్లాలో తొలివిడతలో 576 ఒకటో తరగతిలో సీట్లు అలాట్‌మెంట్ చేసి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అడ్మిషన్లు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. వీటిలో పలు విద్యాలయాలు పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు పోర్టల్‌లో వివరాలు కూడా నమోదు చేసుకున్నాయి. తొలివిడత ఎంపికైన విద్యార్థులు 8వతరగతి వరకు ఉచితంగా చదువుకునే వెసులుబాటు ఉంది. అయితే నేటికీ 293 అడ్మిషన్లు మాత్రమే పూర్తి కాగా మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కూడా 20 మందికిపైగా తాము ఆయా పాఠశాలల్లో చేరమని రాతపూర్వకంగా రాసిచ్చారు. దీనికి కారణాలు మాత్రం అనేకం ఉన్నాయనే అంటున్నారు. యాజమాన్యాలు తమను చిన్నతనంగా మాట్లాడుతున్నారని, తమపై నిర్లక్ష్యం చూపుతూ గంటల తరబడి పాఠశాలల బయట నిలుచో బెడుతున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు భయపెట్టి మరీ పాఠశాలలో చేరమని రాయించుకుంటున్న సంఘటనలు కూడా జరుగుతుండడం విశేషం. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు తాము సిద్ధమవుతున్నట్లు బాధిత తల్లిదండ్రులు తెలిపారు.

జీవోలు ఏం చెబుతున్నాయంటే..

● **జీవో నెం.1 :** 1994లో ఈ జీఓ విడుదలవగా విద్యార్థుల నుంచి వసూలు చేసే రుసుంలో 50శాతం ఉపాధ్యాయుల వేతనాలు, 15శాతం సాంస్కృతిక కళలు, క్రీడలు, 10శాతం సామగ్రి, 15శాతం సౌకర్యాలు, 5శాతం ఇతర పనులకు ఖర్చుచేయాలి. యాజమాన్యాలు కేవలం 5శాత మాత్రమే లాభాలు తీసుకోవాలి. కానీ జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు.

● **జీఓ నెం.246 :** పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి వారితోనే పర్యవేక్షించాలి. ముఖ్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ద్వారా సమస్యలను యాజమాన్యాలకు తెలియచేసి వాటిని పరిష్కరించాలి. భద్రతా కమిటీ పాఠశాలల బస్సులను తనిఖీలు చేయడం, విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడడం వంటివి చేయాలి. కానీ ఇది కూడా ఎక్కడా అమలు కావడం లేదు..

● **జీఓ నెం.42 :** ఈ జీఓ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరి పరిస్థితుల్లో రుసుం పెంచాలనుకుంటే జిల్లా ఫీజు కమిటీ సిఫార్సులు(డీఎఫ్ఆర్‌సీ) అనుమతి పొందాలి. కానీ ప్రతి సంవత్సరం జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులను పెంచి తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి.

● **జీఓ నెం.91 :** దీని ప్రకారం దరఖాస్తు రుసుం రూ.100, రిజిస్ట్రేషన్ రుసుం రూ.500, డిపాజిట్ రూ.5వేలకు మించి ఉండకూడదు. కానీ ప్రాథమిక పాఠశాలల్లోనే వేలల్లో ఫీజులను వసూలు చేస్తున్నారు.

● **జీఓ నెం.91 సెక్షన్ 1సీ :** ఈ జీఓ ప్రకారం పాటశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, యూనిఫాం తదితర విద్యాసామగ్రిని ఉంచకూడదు, అమ్మకూడదు. ఫలానా చోట కొనుగోలు చేయాలని సూచించకూడదు. కానీ ప్రతి పాఠశాలలో కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ వీటిని వ్యాపారం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు

● విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశాల కోసం విద్యార్థులకు ఎలాంటి ప్రతిభా పరీక్ష నిర్వహించకూడదు. అయినా జిల్లాలో 50 శాతం పాఠశాలల్లో ప్రతిభా పరీక్షలు జరుగుతున్నాయి. వెనుకబడిన వారి నుంచి అధిక ఫీజులు వసూలు చేసేందుకే ఈ పరీక్షలు పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఈ విధంగా పరీక్షలు నిర్వహించే యాజమాన్యాలపై విద్యాశాఖ జరిమానాలు విధించాలి. ఇప్పటివరకు ఇలాంటి జరిమానాలు విధించిన దాఖలాలు లేవు.

● ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో తప్పనిసరిగా తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయాలి. ఇందులో ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరించాలి. ఈ విధానం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్నా సమావేశాలపై మాత్రం శ్రద్ధ చూపడం లేదు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాత్రం నామమాత్రంగా అమలు చేస్తున్నారు. కొన్నిచోట్ల తల్లిదండ్రులకు తెలియకుండా యాజమాన్యాలు కమిటీలో ఉన్నట్లు పేర్లు సృష్టిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులందరికీ న్యాయం

ప్రాథమిక విద్యాహక్కు చట్టం కింద ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25శాతం సీట్లు కేటాయించాము. ప్రవేశాలకు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. గడిచిన మూడేళ్లలో ఉన్న బకాయి ఫీజులతోపాటు ఈ ఏడాది ఫీజులు కూడా చెల్లించాలని ఆయా యాజమాన్యాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. పాత బకాయిల చెల్లింపు, కొత్త ఫీజులు వర్తింపునకు సంబంధించి త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల నివేదిక ఆధారంగా ఫీజులన్నీ చెల్లించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తాము.

- డాక్టర్ బాలాజీరావు, డీఈవో



ఆక్రమణలతో కుంచించుకుపోయి, పిచ్చిచెట్లతో నిండిన గచ్చు కాలువ

ముంపు.. ముప్పు తప్పేనా!?

● నెల్లూరులోని కాలువలు బాగుపడేనా?

● 2018లో మొదలైన ఆధునికీకరణ పనులు

● వైసీపీ హయాంలో పనులకు బ్రేకులు

● తాజాగా రూ.176 కోట్లతో అంచనాలు

8

2015లో జరిగిన విధ్వంసం గుర్తుందా!?. ఎడతెరిపిలేని వర్షం కురవడంతో నెల్లూరు నగరం మొత్తం నీట మునిగింది. నగరం నుంచి నీటిని బయటకు పారించేందుకు అప్పట్లో ఎంత శ్రమ పడాల్సి వచ్చిందో నగరవాసులుకు తెలియనిది కాదు. నాటి పరిస్థితి మరోసారి పునరావృతమైతే ఏమిటి పరిస్థితి?. తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పుడుస్తుంది. నగరం మరోసారి వరద ముంపునకు గురికాకుండా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రధాన కాలువల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. కొన్ని కాలువలకు లైనింగ్ కూడా చేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పనులకు బ్రేకులు పడ్డాయి. అయితే ఇప్పుడు మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నగర ప్రజలంతా కాలువలను బాగు చేయాలని కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా రూ.176 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



మృతులు వెంకటేశ్వర్లు, స్వర్ణలత (ఫైల్)

నాలుగు రూకలు సంపాదించుకుంటే తప్ప వారి నోట్లోకి ముద్ద వెళ్లలేని పరిస్థితి. వయసు పైబడిన ఆ దంపతులు ఏ పని చేయలేక జాతీయ రహదారి పక్కనే చిన్న దుకాణం పెట్టుకుని జీవిస్తున్నారు. అలాంటి వారిపాలిట ఓ మినీ ట్రక్కు మృత్యువుగా మారింది. దుకాణంలో ఉన్న వారిపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దుత్తలూరు మండలంలో మంగళవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.

దూసుకొచ్చిన మృత్యువు

● దుకాణంలోకి చొచ్చుకెళ్లిన మినీ ట్రక్కు

● డ్రైవర్ నిద్రమత్తే కారణం?

● దంపతుల మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన పరుశుబోయిన వెంకటేశ్వర్లు (65), స్వర్ణలత (63) ఎస్సీ కాలనీ సమీపంలో హైవే పక్కన దుకాణం పెట్టుకుని ఉన్నారు. నర్రవాడ నుంచి పూల కోసం ఓ మినీ ట్రక్కు ఆత్మకూరుకు బయలుదేరింది. ఎస్సీ కాలనీ సమీపానికి ట్రక్కు రాగానే డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం కారణంగా వాహనం అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌కు 20 అడుగుల దూరంలో ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో దుకాణంలో ఉన్న వెంకటేశ్వర్లు, స్వర్ణలతపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ట్రక్కులో ఉన్న సుమంత్ అనే వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆయన్ను 108 వాహనంలో దుత్తలూరు వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మృతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతుల మృతితో గ్రామంలో విషాదం నెలకొనడంతోపాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన మినీ ట్రక్కు

● **ప్రమాదశాత్తు పడి..**

సీతారామపురం : ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి 108 అంబులెన్స్ ఉద్యోగి మృతి చెందాడు. సీతారామపురంలోని రాజుగారివీధికి చెందిన ఓంకారం వెంకటనారాయణ రాజు (38) స్థానిక పీహెచ్‌సీలోని 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి డ్యూటీ ముగించుకుని మంగళవారం ఉదయాన్నే ఇంటికి వచ్చాడు. సమీప బంధువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆటోలో ఉదయగిరి బయలుదేరారు. ఈ క్రమంలో బసినేనిపల్లి గ్రామం సమీపాన నిద్రమత్తులో ఆటో లో నుంచి వెంకట నారాయణరాజు కింద పడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఉదయగిరిగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు చిన్న కుమార్తెలు ఉన్నారు. ఉద్యోగ విధులను అంకితభావంతో నిర్వహిస్తూ అందరితో సౌమ్యుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి అకాల మరణంతో అందరినీ శోకసంద్రంలో ముంచెత్తింది.



వెంకటనారాయణరాజు మృతదేహం

● **రైలుపట్టాలపై వేర్వేరు చోట్ల...**

బిట్రగుంట : బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని రైలు పట్టాల పక్కన వేర్వేరు ప్రాంతాల్లో రెండు పురుష మృతదేహాలను గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్‌కు ఉత్తరాన దిగువ లూప్‌లైన్ యాడ్ 202/10-12 కిలోమీటర్ల వద్ద 45ఏళ్ల వయసు గల పురుష మృతదేహం గుర్తించామన్నారు. పూర్తి చేతుల బులుగు రంగు జీన్స్ షర్టు, కాషీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతిపై బిందుశ్రీ అని టాటూ మార్క్ ఉందని, ఎడమ చేతిపై అమ్మ అనే టాటూ, రెండు వైపులా సిలువ గుర్తులు ఉన్నాయని అన్నారు. ఛాతీపైన కళ్యాణి అనే టాటూ మార్క్ ఉన్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. అల్లూరురోడ్డు తలమంచి రైల్వే స్టేషన్ల మధ్య 195/9-11 కిలోమీటర్ల మధ్య సుమారు 36 ఏళ్ల వయసు గల పురుష మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడి వద్ద లభించిన పాన్‌కార్డును బట్టి త్రిపుర రాష్ట్రానికి చెందిన జిబిట్వా బన్నా చక్మగా అని ఉందన్నారు. రెండు మృతదేహాలను కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

● **బావిలోపడి బాలిక..**

వెంకటాచలం : అనికేపల్లి పంచాయతీ రామాపురం గిరిజన కాలనీ పక్కనే ఉన్న బావిలో పడి ఒక బాలిక మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... ఏకసిరి పోలయ్య కుమార్తె శ్రీవల్లి (9) గొలగమూడిలోని పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. బావి వద్ద ఆడుకుంటూ ప్రమాద వశాత్తు జారి బావిలో పడి మృతి చెందింది. స్థానికులు గుర్తించి ఆ బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. చలనంలేని బిడ్డను చూసి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.24 లక్షలు దోచేశారు!

నెల్లూరు(క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వ్యక్తి నుంచి రూ.24 లక్షలు కాజేశారు. దీనిపై నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... నగరంలోని డైకాస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన ఎం లక్ష్మీనరసింహం అనే వ్యాపారికి ఈ నెల 10వ తేదీన ఓ మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ అధికారునంటూ పరిచయం చేసుకుంది. మానవ అక్రమ రవాణా చేసే సాదర్ ఖాన్‌ను కర్నాటక పోలీసు లు అరెస్ట్ చేశారని అతని బ్యాంకు ఖాతా నుంచి మీ అకౌంట్‌కు రూ.30 లక్షలు బదిలీ అయినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని బెదిరించింది. శివప్రసాద్ అనే వ్యక్తి నుంచి ఫోన్ వస్తుందని తెలిపింది. కొద్దిసేపటికే శివప్రసాద్ అనే వ్యక్తి వీడియో కాల్ చేసి తాను సీబీఐ అధికారిని అంటూ మాటలు కలిపి డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని చెప్పారు. ఆ తర్వాత రెండు దఫాలుగా లక్ష్మీనరసింహం ఖాతా నుంచి రూ.24,20,100 నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. బాధితుడు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహమ్మదాపురం ప్లాంటు వద్ద కేంద్ర బృందం

నీటి నిర్వహణ ఎలా!?

నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో రెండు రోజులుగా కేంద్ర జల వనరుల శాఖకు చెందిన ఓ బృందం పర్యటిస్తోంది. మంగళవారం మహ్మదాపురంలోని తాగునీటి శుద్ధి ప్లాంటు, సరఫరా విభాగాలను బృంద సభ్యు లు పరిశీలించారు. అక్కడ నుంచి నగరానికి చేరుతున్న నీటి పంపింగ్ వ్యవస్థను పర్యవేక్షించారు. అనంతరం నగరంలోని నీటి పొదుపునకు తీసుకుంటున్న చర్యలు, భూగర్భ జలాల వృద్ధికి కార్పొరేషన్ నిర్వహిస్తున్న ప్ర ణాళికలు, తాగునీటి సరఫరా, వాటర్ ట్యాంకుల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి తయారీ ప్లాంటు తదితర వాటిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వీటన్నిటిపై నివేదిక తయారు చేసి, కేంద్రానికి అందజేస్తామని బృందంలోని సభ్యులు ప్రదీప్‌కుమార్, రాంబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్య నివారణ చర్యలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు

● అధునాతనంగా పొదలకూరు బస్టాండు నిర్మాణం

● ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సురేష్‌రెడ్డి వెల్లడి

- వివరాలు 8లో..

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించండి

ముత్తుకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జడ్ శివప్రసాద్‌ను గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు కోరారు. మంగళవారం బుజ్జమ్మ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొలుసు రత్నం ఆధ్వర్యంలో ముత్తుకూరు, గూడూరు, చిట్టమూరు మండలాల గ్రామీణ వైద్యులు శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9483
వెండి కిలో ధర	రూ. 109800
వెండి ఒక గ్రాము	రూ. 112.80

ఎస్‌ఐపై విచారణ జరపాలి


బాధితుడిని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

మనుబోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మనుబోలు ఎస్‌ఐపై డీఎస్పీ విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నెల్లూరులో చికిత్స పొందుతున్న ఇనగలూరు మహేష్‌ను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నేలపాటి రఘురామయ్య మాట్లాడుతూ కోడె దూడను దొంగతనం చేశాడన్న నెపంతో వీరంపల్లి పంచాయతీలోని కొండుపాళెంకు చెందిన దళిత యువకుడు ఇనగలూరు మహేష్‌తో ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించారన్నారు. మూడు రోజులు స్టేషన్‌కు పిలిపించి హింసించారని ఆరోపించారు. అతను అనారోగ్యం పాలవడంతో ఆసుపత్రిలో చేర్చారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ తీరుపై డీఎస్పీ విచారణ జరిపి, బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలూరు తిరుపాలు, జే వెంకమరాజు, మంగళ పుల్లయ్య, బట్టా పెద్దబ్బయ్య, తలారి దేవదానం పాల్గొన్నారు.

అధికారులను కలిసిన టీడీపీ నేతలు


తహసీల్దార్‌ను సన్మానించిన మనుబోలు టీడీపీ నాయకులు

మనుబోలు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో మండలానికి వచ్చిన కొత్త అధికారులను మంగళవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవి, డీటీ ప్రదీప్‌ను, ఆర్‌ఐ అరుణ్‌బాబు, ఏవో వెంకట కృష్ణయ్యను కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి రాయపాటి కిరణ్‌కుమార్, దండు చంద్రశేఖర్‌రెడ్డి, పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, మారంరెడ్డి రమణారెడ్డి, చెల్లగిరి ప్రసాద్, గుంజి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

50శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ శివనాయక్

మనుబోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే మండల రైతాంగానికి 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నదని వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్ తెలిపారు. మంగళవారం మనుబోలు రైతుసేవాకేంద్రం-2లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను ఇస్తామన్నారు. వరిపంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణయ్యపలువురు రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయని, వాటి అభివృద్ధి కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కే. డేవిడ్ రాజు కోరారు. ఈ మేరకు సీపీఎం, అనుబంధ సంఘాల నేతలతో కలిసి వెళ్లి మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ పట్టణంలోని జ్యోతినగర్, మిరియాలకట్ట వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలు, బీఎస్‌ఆర్ సెంటర్ సమీపంలో ఉన్న ముస్లిం స్మశాన వాటిక, అలాగే వందూరుగుంటలో ఉన్న క్రైస్తవుల సమాధుల తోటలో జంగిల్ క్లియరెన్స్ చేయించి రోడ్లు, తాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. అలాగే బొగ్గేరు దగ్గర ఉన్న శ్మశాన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

దుస్థితిలో గ్రామసీమలు

● నేటికీ సీసీ రోడ్లు, డ్రైన్లు లేక అవస్థలు ● తాగునీటి సమస్యతో గ్రామీణుల ఇక్కట్లు


ఇస్కపాళెం వడ్డిపాళెంలో 40 ఏళ్లుగా దర్శనమిస్తున్న మట్టి రోడ్డు

బుచ్చిరెడ్డిపాళెం,జూన్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా అభివృద్ధి సున్నా అనేరీతిలో బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని కొన్ని గ్రామాలు ఉన్నాయి. నేటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు దుస్థితిలో దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఇస్కపాళెం వడ్డిపాళెం, నాగమాంబాపురం, విలియమ్స్‌పేట, రామచంద్రాపురం, ఆ గ్రామ ఎస్టీ కాలనీలు, పోలినాయుడు చెరువు గిరిజనకాలనీ, పెనుబల్లి, జొన్నవాడ కాళయకాగొల్లు, కట్టుబడిపాళెం, దామరమడుగు, ఆర్‌ఆర్. నగర్, పల్లిపాళెం, నాగాయగుంట, మినగల్లు తదితర గ్రామాల్లో పలు చోట్ల రోడ్లు డ్రైన్లు, సీసీరోడ్లు లేవు. మరికొన్ని గ్రామాలు ఏళ్లతరబడి మట్టిరోడ్లతో గోతులుమయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షాకాలంలో ఆయా గ్రామాలు బురదమయంగా తయారై వ్యాధుల బారిన పడుతున్నాయి.

● అభివృద్ధిని గాలికొదిలిన వైసీపీ

వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిని గాలికొదిలేసింది. గ్రామాల అభివృద్ధికి ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి నిధులు రాక సర్పంచులంతా రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచలంచెలుగా గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయి.

పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ



పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ వచ్చింది. మండలంలో రూ.4కోట్లు మేర ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల మంజూరుతో సీసీరోడ్లు, డ్రైన్లు, తాగునీటి అవసరాల పనులు చేపడుతున్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ గృహాలు మంజూరయ్యాయి.

- బెజవాడ జగదీష్, బుచ్చి రూరల్ టీడీపీ అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వంతో నగర పంచాయతీ అభివృద్ధి



"కూటమి ప్రభుత్వంలో సీసీరోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైపులైన్లు, బోర్ల అభివృద్ధి జరిగాయి. త్వరలో కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ, బుచ్చికి బైపాస్‌రోడ్డుతో పాటు మరో రూ. 10 కోట్లతో నగర పంచాయతీలో ప్రజా అవసరాలు, అభివృద్ధి పనుల నిర్మాణాలకు నిధులకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపదనలు పంపాం. ఎంపీ, ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతుల సహకారంతో భవిష్యత్తులో బుచ్చి సంపూర్ణ అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నాం.

-చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

ఘనంగా అభయాంజనేయస్వామి ఉత్సవం


అభయాంజనేయ స్వామి ఉత్సవంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

పొదలకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీర అభయాంజనేయస్వామి జయంతిని పురస్కరించుకుని 13 వారాలపాటు వారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో మంగళవారం రెడ్డి జన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజను ఆలయ ప్రధాన అర్చకుడు బోజనపల్లి గోపాలకృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి దంపతులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలపై అభయాంజనేయస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, మహిళా మండల అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, టీడీపీ నాయకులు డేగా యశ్వంత్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, మురళీరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగువమిట్టలో 'ఇంటింటికి సోమిరెడ్డి కుటుంబం'

వెంకటాచలం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా ఇంటింటికి సోమిరెడ్డి కుటుంబం అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎగువమిట్ట గ్రామంలో మంగళవారం సాయంత్రం రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి దంపతులు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్ రెడ్డి, నాయకులు ముక్కు చంద్రశేఖర్, ముక్కు రాంబాబు, శ్రీనితారెడ్డి, నిక్కుదల రమేష్, బాబిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S


హత్య వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

● వేధింపులు తాళలేక అఘాయిత్యం

నెల్లూరు(క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన భర్తను బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే సాంబ శివరావు మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. బాలాజీనగర్ వైకే ఆచారి స్కూలు వీధిలో ఎల్ విజయ్‌చంద్ర, శైలజ(46) దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. విజయ్ చంద్ర ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శైలజ తండ్రి చెన్నైలో ఉంటూ మృతిచెందారు. ఆయనకు చెందిన ఆస్తులు తమకు రావాలంటే కొంత నగదు ఖర్చు చేయాలని భర్తకు శైలజ చెప్పింది. అతని అంగీకారంతో కోర్టులో కేసు వేసి భర్తతో రూ.40 లక్షలకుపైగా అప్పు చేయించింది. ఈ అప్పుల కారణంగా విజయ చంద్ర పిల్లల ఫీజులు కట్టలేకపోయారు. ఇదిలా ఉండగా భర్తపై శైలజ అనుమానం పెంచుకుంది. ఆయన విధులకు వెళ్లినా వీడియోకాల్ చేసి వేధించేది. తరచూ భర్తతో గొడవపడుతూ ఉండేది. దీంతో ఎందుకలా చేస్తున్నావని కుమారులు కూడా తల్లిని ప్రశ్నించేవారు. భార్య వేధంపులు తాళలేక ఆమెను అంతమొందించాలని విజయచంద్ర నిర్ణయించుకున్నారు. ఈ నెల 14వ తేదీ పిల్లలిద్దరిని భోజనం తీసుకురావాలని బయటకు పంపారు. పథకం ప్రకారం భార్య గొంతుకు టవల్ బిగించి చంపేందుకు యత్నించాడు. ఆమె చావకపోవడంతో రోకలి బండతో బలంగా తలపై కొట్టాడు. ఆమె మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత పరారయ్యాడు. పెద్దకుమారుడు శ్యామ్ సాత్విక్ ఫిర్యాదుతో బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు విజయచంద్రను సోమవారం ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు అరెస్ట్ చేశారు. కేసు చేదనలో ప్రతిభ కనపరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

దాడి కేసులో జనసేన నేతల అరెస్ట్

కావలి రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డిపాలెంలో ఈనెల 12న టీడీపీ, జనసేన నాయకుల మధ్య జరిగిన ఘర్షణ కేసులో మంగళవారం పలువురు జనసేన నాయకులను అరెస్ట్ చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు, చిన్నపిల్లల క్యారమ్ బోర్డు ఆట వద్ద జరిగిన వివాదంలో వడ్డిపాలెంకు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ పల్లపు పద్మ పై అదే ప్రాంతానికి చెందిన జనసేన నాయకుడు మస్తాన్ తోపాటు మరో ఆరుగురు దాడి చేశారు. మస్తాన్ భార్య ప్రసన్న కటింగ్‌బ్లేడుతో పద్మ పెదవిపై వత్తటంతో తీవ్రగాయమైంది. దీంతో పద్మ ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ ఎస్‌ఐ జమాల్‌వలి ఏడుగురికి అరెస్ట్‌చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తూనికల, కొలతల అధికారి ఆకస్మిక తనిఖీ

● రూ. 25 వేల వరకు జరిమానా

సంగం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సంగంలోని పలు దుకాణాలను కావలి డివిజన్ తూనికల, కొలతల (లీగల్ మెట్రాలజీ) శాఖ ఇన్‌స్పెక్టర్ మోహిస్సీన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో తూనికల కొలతల రాళ్లు, కాటాల్లో తేడా, వాటిపై తూనికల, కొలతలశాఖ ముద్రలు లేకపోవడంతో జరిమానా విధించారు. ఐదు దుకాణాలపై సుమారు రూ. 25 వేల వరకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అధికారుల దాడులు గమనించిన పలువురు దుకాణాదారులు అంగళ్లను మూసివేశారు.

పాత కక్షలతో దాడి: వ్యక్తికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని నర్రవాడ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నర్రవాడ గ్రామానికి చెందిన శివకుమార్‌కు అదే గ్రామానికి చెందిన కొంతమందితో పాత కక్ష్యలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బ్రహ్మోత్సవాలను చూసి గుడిగంట్ల ఉదయ్‌కుమార్‌తో కలిసి పచ్చవ శివ ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. జనార్ధనస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి గ్రామానికి చెందిన పచ్చవ వెంగళరావు, పచ్చవ వెంగయ్య, తిరివీధి శ్రీనివాసులు, తిరివీధి చెన్నకేశవులు, మాతంగి రామకృష్ణ, తిరివీధి రాధాకృష్ణ ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి శివపై దాడి చేశారు. ఈ దాడిలో అతని తలపై తీవ్ర గాయమైంది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ ఆదిలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే

● నిరుపేద మహిళ ఇంటికెళ్లి సమస్య తెలుసుకుని ..

ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థికసాయం

● కుటుంబానికి అండగా ఉంటానని కాకార్ల భరోసా

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షబ్బీర్ కాలనీకి చెందిన నిరుపేద మహిళ సమస్యపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తక్షణమే స్పందించారు. భర్తను కోల్పోయి నలుగురు ఆడపిల్లలతో కుటుంబ పోషణ భారమై, వారిని చదివించలేక ఆర్థిక ఇబ్బందులతో జబీన అనే మహిళ సతమతమవుతోంది. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో జరిగిన తప్పిదంతో ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే టీడీపీ నాయకులు, అధికారులతో మంగళవారం రాత్రి ఆమె నివాసానికి వెళ్లారు. సమస్యలపై ఆమెతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో, తహసీల్దారు, హౌసింగ్ అధికారులతో అక్కడికక్కడే చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో జరిగిన తప్పిదాన్ని సవరించి ఆమె కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీవో అప్పాజీకి సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆమె కుమార్తె చదువుకు అవసరమైన ఆర్థికసాయాన్ని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. సొంత ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. తన ట్రస్టు ద్వారా ఖర్చుల నిమిత్తం తక్షణసాయం కింద రూ.50 వేలు అందజేశారు. స్థానిక నాయకులు, ప్రభుత్వం అండగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, సందానీ, షర్ఫుద్దీన్, గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.


సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బారావు

కొడవలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని ఎంపీడీవో సుబ్బారావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పారిశుధ్య సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

కొడవలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగడిచెలిక పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై డీఎల్‌పీవో వెంకట్ మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రేగడిచెలిక పంచాయతీలో పారిశుధ్యం, రోడ్ల నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అభియోగంపై రికార్డులు పరిశీలించామని, ఈ అంశంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ అధికారులు ఉన్నారు.

రేషన్ షాపు కోసం వినతి

రాపూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అరుంధతివాడలో రేషన్ షాప్ కోసం జనసేన నాయకురాలు కొండాపురం కస్తూరి ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరుంధతివాడలో 300కుపైగా కుటుంబాలు ఉన్నాయని, ఎక్కువ మంది రోజువారి కూలీలు కావడంతో రేషన్ తెచ్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అరుంధతివాడకు రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరారు.


రేషన్ షాపు కోసం వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకురాలు కొండాపురం కస్తూరి

వాగుపాలవుతున్న వరవ నీరు

● కాలువను బాగుచేస్తే చెరువుకు సమృద్ధిగా...

● అడ్డంకిగా ఆక్రమణలు ● వర్షాలకు ముందే మరమ్మతులు అవసరం


ఆక్రమణలకు గురైన వరవ కాలువ

పొదలకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏటా వర్షాకాలంలో పొదలకూరు చెరువు వరవ (సప్లై చానల్) కాలువ నీరు వాగు పాలవుతోంది. ఈ కాలువ నుంచి నీరు మధ్యలోనే లేఅవుట్ మీదుగా వాగులోపడి పార్లపల్లి చెరువుకు చేరుతోంది. వరవ కాలువ పొదలకూరు పట్టణం నడిబొడ్డున ఉంది. పొదలకూరు - నెల్లూరు మార్గంలో ప్రారంభమై పట్టణంలోని పలు ప్రాంతాల్లో మలుపులు తిరుగుతూ చెరువుకు చేరుకుంటుంది. పట్టణం విస్తరించడంతో క్రమంగా కాలువ కబ్జాకు గురైంది. దీనికితోడు వ్యర్థాలు చేరి అది మురుగు కాలువగా మారిపోయింది. పూడిక కారణంగా నీరు సజావుగా సాగడంలేదని రైతులు వాపోతున్నారు. కాలువను బాగు చేయమని పొదలకూరు, లింగంపల్లి రైతులు చాలాసార్లు అధికారులు, పాలకులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాలువలో పూడిక తొలగింపు పనులు నిర్వహించారు. అయితే జలవనరుల శాఖ అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతుం డటంతో కాలువ తరచూ చెత్తతో నిండిపోతోంది.

● వర్షాలకు ముందే రిపేర్లు చేయాలి

పొదలకూరు చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు వర్షాకాలంలో నిండేందుకు వరవ కాలువ ప్రధానమైనది. ఎడమ గట్టు కాలువకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసినా చెరువుకు నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. దీంతో చెరువు నిండేందుకు కాలువపైనే ఆధారపడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే కాలువకు గండ్లు పడుతున్నాయి. పూడికతో నిండిన కాలువ గుండా చెరువుకు నీరు చేరాలంటే ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. ఈ నేపథ్యంలో రాబోవు వర్షా కాలానికి ముందే కాలువకు రిపేర్లు చేస్తే చెరువులోకి నీరు చేరేందుకు అవకాశం ఉంటుంది.

పూడిక తొలగించాం

కాలువలో పేరుకున్న పూడికను ఇటీవల తొలగించాం. అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిందిగా హెచ్చరించాం. గతేడాది లేఅవుట్లలో ఉన్న కాలువను తిరిగి తవ్వించాం. కొత్తగా ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకుంటాం. చెరువుకు సప్లై చానల్ గుండా నీరు వెళ్లేందుకు అన్నీ చర్యలు తీసుకుంటాం.

- అనిల్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ, పొదలకూరు.

యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

ఇందుకూరుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి డీ.సత్యవాణి తెలిపారు. మండలంలోని ఇందుకూరుపేట పంచాయతీ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 2025- 26 సంవత్సరానికి సబ్సిడీపై రోటావేటర్, కల్టివేటర్, కేజీవీల్స్, జింక్, జిప్సం, బోరాన్ మొదలైనవి అందజేస్తామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాను ఆయా గ్రామాల ఆర్‌ఎస్‌కేలో ఉంచామన్నారు. అనంతరం వరిపైరులో తెగుళ్లు, పురుగులు వాటి నివారణ గురించి తెలియజేశారు. జొన్న, అరటి, బెండకాయ తోటల సస్యరక్షణ చర్యలను తెలిపారు. ఇందుకూరుపేట ఏడీఏ సుమలత, ఏడీఏ నర్సో జీరావు, ఎంఏవో డీ. రఘునాథరెడ్డి, వెటర్నరీ డాక్టర్ జీ.నాగేంద్ర, వీఏఏలు తిరుమల, దీక్షిత పాల్గొన్నారు.


కోవూరులోని కెనరా బ్యాంకు

కెనరా బ్యాంకులో మొరాయిస్తున్న కంప్యూటర్లు

కోవూరు, జూన్17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంకులో రెండు రోజులుగా కంప్యూటర్లు మొరాయిస్తున్నాయి. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్యాంకులో లావాదేవీల కోసం సోమ, మంగళవారాల్లో శివాలయం సమీపంలోని కెనరా బ్యాంకు వెళ్లిన ఖాతాదారులు ఆన్‌లైన్ పనిచేయడంలేదని సిబ్బంది వివరిస్తున్నారు. రెండు రోజులుగా జాతీయస్థాయిలో కెనరాబ్యాంకుల్లో ఖాతాదారులకు సేవలందించే విధానం తరచూ అంతరాయం కలుగుతోందని వారు తెలిపారు.

నిమ్మతోట ధ్వంసం చేశారని తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితురాలు

రాపూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలం గోనుపల్లి గ్రామంలో గాలి శంక రమ్మ అనే మహిళా రైతు పొలాన్ని ధ్వంసం చేసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. శంకరమ్మ తెలిపిన వివరాల మేరకు గోనుపల్లి గ్రామంలో ఎన్.హెచ్.565కు ఆనుకోని, గొల్లబోయిన స్వామి వారి ఆలయం ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 226, 382-2లో గల 2 ఎకరాల 48 సెంట్లు గల భూమిలో నిమ్మచెట్ల మొక్కలను నాటించడం జరిగింది. ఈ పొలంతో ఏ మాత్రం సంబంధం లేని స్థానికులైన తిరుపతి నీరజ, వల్లెపు క్రిష్ణయ్య, గుంజి సుబ్బు చెంచు, చిన్నక్క, వెంకటేశ్వర్లు, కల్పన, కొండయ్య, అలాగే గురవయ్య, ప్రసాద్ మరికొంత మంది సహకారంతో పొలం వద్దకు చేరుకుని ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేశారు. అంతేకాకుండా పొలంలో నాటిన నిమ్మ మొక్కలను పీకి వేశారు. దీంతో బాధితురాలు, బంధువులు పొలం దగ్గరకెళ్లి వాళ్లను అడ గడంతో బాధితురాలి తరపు కొంత మందిని వారు కొట్టడం జరిగింది. అంతే కాక మీకు చేతనైంది చేస్కో అంటూ హెచ్చరించారని తెలిపింది. ఈ విష యంపై బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, రెవెన్యూలో ఫిర్యాదు చేసింది. తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరింది.

ఈకేవైసీ తప్పనిసరి

విడవలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధి కారి లక్ష్మీ తెలిపారు. విడవలూరు సచివాల యంలోని ఆర్‌ఎస్‌కేలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతు లకు ఈకేవైసీ నమోదుపై అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో రైతులు చెముకుల శ్రీనివాసులు, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, దేవళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్
ఆంధ్రజ్యోతి
బుధవారం, 18 జూన్ 2025
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
కోడిగుడ్ల ధర (100): 515	



రాజరాజేశ్వరి ఆలయంలో యోగా శిక్షణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతీ ఆదివారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు యోగా తరగతులు నిర్వహిస్తున్నామని దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయనతోపాటు ఆలయ సిబ్బంది, అర్చకులు యోగా సాధన చేశారు. రోజూ యోగా చేయడంతో ఒత్తిడి తగ్గి, ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని కోరారు.

ప్రత్యామ్నాయం లేనట్టే..!

● ఎడగారులో వరికే జై! ● రూరల్‌లో విస్తీర్ణమంతా అదే సాగు ● కనుమరుగైన ఆరుతడి పంటలు

నెల్లూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ ప్రధాన వ్యవసాయ సీజన్. ఈ సమయంలో విస్తీర్ణమంతా వరి పంటనే పండిస్తుంటారు. ఎడగారు సీజన్‌లో మాత్రం ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటూ ఉంటారు. అయితే ప్రస్తుత ఎడగారు సీజన్‌లోనూ రైతులు పూర్తిగా వరినే పండిస్తున్నారు. నెల్లూరు రూరల్ ప్రాంతం రైతులు ఈ సారి ఆరుతడి పంటల వైపు కన్నెత్తి చూడలేదు. సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులంతా వరిసాగుకే జైకొట్టారు.



నారేతలకు సిద్ధంగా ఉన్న చివరి ఆయకట్టు నేల

రూరల్ ప్రాంతంలోని ఆమంచర్ల, దొంతాలి, మొగళ్లపాళెం, గొల్లకందు కూరు, వెల్లంటి, సజ్జాపురం, ములుముడి, దేవరపాళెం, కొమ్మరపూడి, కంద మూరు, ఉప్పుటూరు గ్రామాల్లో ప్రతి సంవత్సరం ఎడగారు తరుణంలో వరికి ప్రత్యామ్నాయ పంటలు పండిస్తారు. ఆరుతడి పంటలైన కూర గాయలు, ప్రత్తి, పుచ్చ, మినుము, పెసర, నువ్వు, బంతిపువ్వు, కాగడాలు వంటి పంటలను సాగుచేయడం ఆనవాయితీ. మోటార్ల కింద నీటి లభ్యత ఉన్నవారిలో అతి కొద్దిమంది మాత్రమే వరి సాగు చేస్తుంటారు. కానీ ప్రస్తుతం ఎడగారులోనూ జలాశయాల్లో తగినంత నీరు ఉండటం, పంటలకు విడుదల చేయడంతో స్థానికంగా చెరువుల్లోకి నీళ్ల చేరి సాగుకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతాంగం పూర్తి విస్తీర్ణం వరి సాగు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా కేఎన్ఎం, బీపీటీ రకాలతో ఎంటీయూ రకాన్ని సాగులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం 20 వేల ఎకరాల్లో 90 శాతం వరకు వరినాట్లు పూర్తి చేసిన రైతులు చివరి ఆయకట్టు సాగులో నారేతలు వేస్తున్నారు. ఎడగారులో ఇప్పటి వరకు ఎప్పుడూ వరి సాగు చేయనటువంటి ప్రాంతాల్లోనూ ఈ సారి వరి పంటను సాగులోకి తీసుకువచ్చారు.



రూరల్ మండలంలో సాగు చేస్తున్న వరి

ఆరుతడి పంటలు కనుమరుగు

ఎడగారులో వరి సాగుతో ఆరుతడి పంటలు కనిపించడం లేదు. ఈ ప్రభావం నెల్లూరు మార్కెట్‌పై చూపే అవకాశాలున్నాయి. రూరల్ నుంచి ఆకుకూరలు, కూరగాయలు నెల్లూరులోని ఏసీ మార్కెట్‌కు వస్తుంటాయి. ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న పూల మార్కెట్‌కు కూడా పూలు చేరుతుంటాయి. కానీ ఈసారి అవేమి సాగు లేకపోవడంతో స్థానిక ఉత్పత్తులు జిల్లా వాసులకు దూరమయ్యాయి.



ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని బస్సు పాసుల కౌంటర్ వద్ద ఎర్రటి ఎండలో క్యూలైన్‌లో నిలబడి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆర్టీసీ పాసుల కోసం బారులు

● ఎర్రటి ఎండలో విద్యార్థుల కష్టాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు పాసుల కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో బస్టాండులోని కౌంటర్ల వద్ద రెండు రోజులుగా రద్దీ నెలకొంది. విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో ఆర్టీసీ బస్సుల్లో రాయితీ పాస్‌ల కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు పోటీపడుతున్నారు. ఇదే సమయంలో బస్సు పాస్‌ల సాఫ్ట్‌వేర్‌ను ఆర్టీసీ అప్‌డేట్ చేయడంతో ఈ నెల 12, 13 తేదీల్లో పాసుల జారీ కౌంటర్లు మూసివేశారు. 14వ తేదీ రెండవ శనివారం, 15వతేదీ ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం నుంచి పాసుల కోసం విద్యార్థులు అధిక సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా డిపోల్లోని కౌంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. మంగళవారం సైతం బస్సు కౌంటర్ల వద్ద విద్యార్థుల సంఖ్య అధికంగానే కనిపించింది. నెల్లూరులోని బస్టాండులో ఎర్రటి ఎండలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని పాస్‌లు పొందారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాసుల కోసం వస్తున్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉంటే బాగుండేదని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

న్యూస్ బాక్స్

అధిక ఫీజుల వసూళ్లు అరికట్టాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని, దీనిని ప్రభుత్వం అరికట్టాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. స్థానిక జర్నలిస్టు భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేటు విద్యా సంస్థలు పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, క్రీడా మైదానాల్లేవని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అధిక ఫీజులు వసూలు చేసే విద్యా సంస్థలపై తగు చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట సరస్వతీ సమాజంలో బుధవారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు సరస్వతీ సమాజంలో అభివృద్ధి పనులు, భోజనశాల ప్రారంభోత్సవం జరుగుతాయని, మంత్రి పొంగూరు నారాయణ హాజరవుతారని తెలిపారు.

మారుతికి మామిడి రసాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమంతుడికి మంగళవారం మామిడి పండ్ల రసంతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం మామిడి పండ్లతో స్వామి వారికి సహస్ర నామార్చన చేశారు. అనంతరం పల్లకీసేవ వైభవంగా జరిగింది.

వ్యక్తిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాట్లాడుకుందాం రమ్మని పిలిచి ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేశారు. పోలీసుల సమాచారం మేరకు... బాలాజీనగర్ మసీదు సెంటర్ ప్రాంతంలో ఎండీ షాకీర్, ఎండీ షాఖీబ్ అనే బంధువులు నివసిస్తున్నారు. షాకీర్ పాత బైక్‌లు కొనుగోలు చేయడం, అమ్మడం చేస్తుంటాడు. షాఖీబ్ మంగళవారం సాయంత్రం షాకీర్‌కు ఫోన్‌చేసి ఓ బైక్ కొనుగోలు విషయమై మాట్లాడుకుందామని పిలిచాడు. మసీదు సెంటర్‌కు షాకీర్ రావడంతో అతనితో మాట్లాడుతూ షాఖీబ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా దాడి చేశాడు. ఈ దాడిలో షాకీర్‌కు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం అపోలో వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివ రావు వైద్యశాలకు చేరుకొని షాకీర్ ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు పేర్కొన్నారు.

కారును వెంబడించి అద్దాలు ధ్వంసం

నెల్లూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్కూటర్‌పై ఇద్దరు వ్యక్తులు కారును వెంబడించి ఆ వాహనం అద్దాలు ధ్వంసం చేసిన ఘటన నెల్లూరు రూరల్లో చోటు చేసుకున్నట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... సోమవారం అర్ధరాత్రి నేలటూరుకు చెందిన అరుణ్‌కుమార్, తన భార్యతో కలిసి కారులో నెల్లూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన నితీష్, అతని స్నేహితుడు చిరువర్ధన్ నేలటూరు యాష్‌పాండు వద్ద, పిడతాపోలూరు పెట్రోల్ బంకు వద్ద, అనంతరం ధనలక్ష్మీపురం వద్ద కారును ఆపి వివాదానికి దిగి అద్దాలు పగలుకొట్టారు. బాధితుడు అరుణ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రేపు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎన్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవన్‌లో సాయంత్రం 4గంటలకు ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మధు గ్యాస్ట్రో హాస్పిటల్ డాక్టర్ డీ మధుసూదన్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తారని, సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్

లింగసముద్రం జూన్ 17 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి మంగళవారం తెలిపారు.

మల్లెల సంజీవయ్య పాఠశాలను

ఉత్తమంగా తీర్చిదిద్దుతాం

● నుడా నిధులతో మైదానం అభివృద్ధి : చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ నగర్‌లో ఉన్న మల్లెల సంజీవయ్య మున్సిపల్(ఎంఎస్ఎం) ఉన్నత పాఠశాలను తాము దత్తత తీసుకుని ఉత్తమ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సంధ్య దంపతులు ప్రకటించారు. ఆ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ చెప్పిన మాటను తూచా తప్ప కుండా అమలు చేసే ప్రభుత్వం చంద్రబాబుదని, వైపీపీ పాలనలో లాగా బ్యాగులపై జగన్ ఫొటోలు వేసుకోలేదని చెప్పారు. ఎంఎస్ఎం హైస్కూల్ మైదానంలో వర్షాకాలం నీళ్ల నిలబడి పిల్లలు ఇబ్బందిపడుతున్నారని, నుడా నిధులు రూ.11 లక్షలతో పాఠశాల మైదానంలో లెవలింగ్ పనులు చేయిస్తానని తెలిపారు. మాజీ కార్పొరేటర్ సంధ్య మాట్లాడుతూ ఈ పాఠశాలను అంకిత భావంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మరో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ, టీడీపీ నాయకులు తానే మస్తాన్, అంచూరు శ్రీనివాసులు నాయుడు, పసుపులేటి మల్లికార్జున, సుభాన్‌బాషా, సాయిరాం, ఎలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్యాగు అందచేస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి

ఓటరు నమోదుపై చైతన్యం రావాలి

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు ప్రక్రియ కంటే ముందు ఓటరుగా నమోదుపై యువతలో చైతన్యం తీసుకురావాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమ య్యారు. డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండే విధంగా ప్రణాళిక తయారు చేసుకుని, ప్రతీ ఓటరుకు పీఎస్ 2 కి.మీ. మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలోకి వచ్చే విధంగా జాబితాలు తయారు చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్వోలకు అందుబాటులో ఉండి స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు దోహదపడాలని కోరారు. కాగా, నగరంలోని 23వ డివిజన్‌లో కమిషనర్, 26, 45 డివిజన్లలో ఎంహెచ్‌వో చైతన్య పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ నందన్

'తల్లికి వందనం' విద్యార్థులకు వరం

● మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అనూరాధ

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం కార్యక్రమం విద్యార్థులకు వరమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ అన్నారు. నగరంలోని 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘంలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు సాయి, క్రాంతి, బూత్ కన్వీనర్లు, బీఎల్ఏలు, మహిళా టీం పాల్గొన్నారు.

జర్నలిస్టులందరూ కుటుంబ సభ్యులు

● ఐపీఆర్ డీడీ సదారావు



సదారావును సత్కరిస్తున్న జర్నలిస్టులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జర్నలిస్టులందరూ తన కుటుంబ సభ్యులుగా వ్యవహరించారని సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు అన్నారు. ఆయన విశాఖ పట్నంకు బదిలీ అయిన సందర్భంగా మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాన్ని ఏపీయూడబ్ల్యూజే, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సామ్నా నాయకులు నిర్వహించారు. ఏ జయప్రకాష్, రమేష్, దయాశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

క్యాంపస్ ఉద్యోగాలకు 'నారాయణ' విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఎంపికల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ తెలిపారు. కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏటా పలు సంస్థలు, మల్టీనేషనల్ కంపెనీలు నిర్వ హిస్తున్న క్యాంపస్ డ్రైవ్‌లలో నెల్లూరు, గూడూరు నారాయణ కాలేజీల విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, హెచ్‌ఆర్ సీతు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

రక్తనమూనాలు సేకరించండి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధిని నిర్ధారించేందుకు జ్వరపీడితుల రక్త నమూనాలను సేకరించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదేశించారు. మంగళవారం నగరంలోని పడారుపల్లి, అనగుంట పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఏఎన్ఎంలు జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరిస్తున్నారా?, వాటిని ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షిస్తున్నారా? అని ప్రశ్నించారు. లార్వా, ఫీవర్ సర్వేల తీరును పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దోమల వల్ల అనేక ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సచివాలయం ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



దోమల కలిగే వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

జీజీహెచ్‌లో వాకర్స్ అన్నదానం

నెల్లూరు(విద్య), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న శ్రీసత్య సాయి సేవాట్రస్ట్‌లో మంగళవారం రోగులు, వారి కుటుంబ సభ్యులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు చింత ల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ సంఘం సభ్యుడు నల్లూరి సుబ్బారావు తల్లి శ్రీలక్ష్మి వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న వాకర్స్ సంఘం సభ్యులు

నాడు నిర్లక్ష్యం.. నేడు బాధ్యతాయుతం

● ధ్వంసం చేసిన కలుజు గోడ పునఃనిర్మాణంతో రైతుల హర్షం






వైసీపీ హయాంలో పగలగొట్టిన చెరువు కలుజు గోడ, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పునర్‌నిర్మించిన చెరువు కలుజు గోడ

అల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో కొంతమంది నాయకులు స్వార్థంతో అల్లూరు చెరువు రెండో లెవల్ కలుజు గోడను ధ్వంసం చేశారు. చేపలు పట్టుకొని లాభార్జన పొందాలనే కారణంతో నిండుకుండలా తొణికిసలాడే చెరువులో నీటి మట్టాన్ని తగ్గించేందుకు ఈ కలుజు గోడను ధ్వంసం చేశారు. దీనిపై గతంలో అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు బీద గిరిధర్ సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రైతులకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు అవసరమయ్యే చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా కలుజు గోడను మంగళవారం పునఃనిర్మించారు. దీంతో 8.2 అడుగుల నీటి మట్టం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ఆయన చర్యలు తీసుకున్నారు.

అండర్‌పాస్ వద్ద మరమ్మతులు.. ఆగిన రాకపోకలు

కావలి, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద రైల్వే ట్రాక్ కింద అన్నపుగుంటలో నుంచి పాపిరెడ్డి చెరువులోకి వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసి ఉన్న అండర్‌పాస్ వద్ద మంగళవారం మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఆటంకం ఏర్పడింది. మురుగునీరు పైన పారకుండా ఉండేలా దాని కింద పైపులైను వేసే కార్యక్రమం చేపట్టారు. పైపులు వేసేందుకు తవ్వుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయి.



రైల్వే ట్రాక్ అండర్ పాస్ వద్ద చేస్తున్న మరమ్మతులు

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్

కావలి రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐకాన్ సెంటర్ వద్ద ఇటీవల జరిగిన ఆత్మీయ సమావేశం లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పై ఫ్లెక్సీల విషయం లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన దామెర్ల శ్రావణ్ కుమార్‌ను మంగళవారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరువర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గౌస్ బాష ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చగా, ఈ నెల 30 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

121 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 510పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 389బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-94, ఆర్‌ఆర్-11, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 12 1బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొ గాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.1 80, సగటు ధర రూ.252.17గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివ కుమార్ తెలిపారు.

లోగ్రేడ్‌నూ కొనుగోలు చేయాలి

వలేటివారిపాలెం : పొగాకు లోగ్రేడ్ క్వింటా రూ. 20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని తె లుగురైతు మండల ప్రధాన కార్యదర్శి గుర్రం లక్ష్మీనరసింహం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అసలే ఈ ఏడాది అధిక వర్షాలు వలన తెగుళ్ల వ్యాప్తి చెంది నాణ్యమైన పొగాకు దిగుబడులు రాలేదని తెలిపారు. అంతేకాక ఇబ్బడిముబ్బడిగా ఖర్చులు పెరిగిపోయాయని ఆయన తెలిపారు.

పాటూరులో 'వీరులదిబ్బ'

కాపాడాలని ప్రభుత్వానికి ప్రజల విన్నపం



ఖడ్గతిక్కన జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన శిల

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన తిక్కన సోదరుడు ఖడ్గ తిక్కన. నెల్లూరు రాజధానిగా మనుమసిద్ధి రాజ్యంలో సర్వసైన్యాధిపతిగా సేవలందిస్తూ చాగలికొండ సమీపంలో 1260వ సంవత్సరంలో కాటమరాజు సైన్యంతో జరిగిన పోరులో వీరత్వం పొందారు. ఆయన మృతదేహాన్ని పంచకళ్యాణి గుర్రం పాటూరు గ్రామ పొలిమేరకు తీసుకువచ్చింది. కొంత మంది వీరుల మృతదేహాలతో కలిపి ఖడ్గతిక్కనను ఇక్కడే ఖననం చేశారు. ఖడ్గతిక్కన భార్య చానమ్మ సతీసహగమనం చేశారని చరిత్రకారులు చెబుతారు. మృతదేహాల్ని ఖననం చేసిన ఈ ప్రాంతాన్ని వీరులదిబ్బగా పిలుస్తుంటారు. ఇప్పటికీ ఖడ్గ తిక్కనను స్మరిస్తూ పలువురు పాటూరు రైతులు ఈ శిలలకు పూజలు చేస్తుంటారు. గత చరిత్రకు చెందిన ఆనవాళ్లు నేటికీ



మిగిలి ఉన్నాయి. శిలల చరిత్ర, చారిత్రక ఆనవాళ్ల సమాధి కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

మార్చి వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సాపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సాపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా- తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేకరైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.



హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడాలి

బిట్రగుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తమ హక్కుల కోసం కార్మికులు కలిసికట్టుగా పోరాడాలని జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వ రరావు అన్నారు. బోగోలు మండల సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆహ్వానం మేరకు కప్పరాళ్ళతిప్ప గోదాములో ము ఠాకార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడాలంటే సంఘంగా ఏర్పడి ఐక్యతతో పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హమాలీ కార్మికుల సంఘం నాయకులు అజయ్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రెహనాబేగం, సీపీఎం నేత తుమ్మల వెంకయ్య, సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి పాల్గొన్నారు.

గురువాయురప్పన్ బ్రహ్మోత్సవాలకు

ఘనంగా అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్న పండితులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని అయ్యప్ప గుడి ప్రాంగణంలో ఉన్న గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమ య్యాయి. ఉదయం మహాలక్ష్మీ, గోదాదేవి సమేత మహావిష్ణు స్వామికి అష్టోత్తర శత కలిశాలతో అభిషేకం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం అంకురార్పణ, యాగశాల ప్రవేశం, దీక్షాధారణ కార్యక్రమాలు జరిగాయి. భద్రాచలం సీతారామస్వామి దేవస్థానం ఆస్థాన ఆచార్యులు కోమండూరు ఇళాయవల్లి స్థలశాయి స్వామి ఆధ్వర్యం లో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉభయకర్తలుగా మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఉషమ్మ దంపతులు, బొందల నరసింహారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కే శ్రీనివాస్, రాధమ్మ దంపతులు వ్యవహరిం చారు. ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పీటీ జగన్నాథం, కేజీ శంకరన్, తదితరులు పర్యవేక్షించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడులు సాధించవచ్చని మండల ఏవో శైలజాకుమారి తెలిపారు. మంగళవారం సోమశిల, పీకేపాడు గ్రామాల్లో రైతులతో ప్రతేక సమావేశం నిర్వహించి విత్తనశుద్ధి, పచ్చిరొట్ట సాగుతో కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు.

మహిళపై అసభ్యకర ప్రవర్తనకు

ఏడాది జైలు శిక్ష

ముత్తుకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి, దాడి చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు స్పెషల్ రైల్వే కోర్టు న్యాయాధికారి పాలమంగళం వినోద్ మంగళ వారం తీర్పుచెప్పారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ముత్తుకూరు వెలుగు కార్యాలయంలో 2021వ సంవత్సరంలో వీఏవోగా పని చేస్తున్న మహిళపై మామిడిపూడి గ్రామస్థుడు పేటా నాగార్జున అసభ్యంగా ప్రవర్తించి దాడి చేశాడు. ఈ ఘటనపై ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నాగార్జునకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ లీలాకుమారి వాదించారు. సాక్షులను కోర్టులో హాజరు పరచడంలో ప్రతిభ కనపర్చిన ముత్తుకూరు ఎస్ఐ పీ విశ్వనాథ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ షేక్ ఖాదర్ మస్తాన్‌ను ఉన్నతాధికా రులు అభినందించారు.

ముంపు.. ముప్పు తప్పేనా!?

- నెల్లూరులోని కాలువలు బాగుపడేనా?
- మోస్తరు వర్షానికే మునిగిపోతున్న ప్రాంతాలెన్నో
- కాలువలు ఆక్రమణలకు గురవడమే కారణం
- 2018లో మొదలైన ఆధునికీకరణ పనులు
- వైసీపీ హయాంలో పనులకు బ్రేకులు
- తాజాగా రూ.176 కోట్లతో అంచనాలు

నెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో నగరం మీదుగా వెళ్లే అనేక కాలువలు ఆక్రమణలకు గురై కుంచించుకుపోయాయి. కృష్ణపట్నం కాలువ హరనాథపురం వద్ద సర్వేపల్లి కాలువ నుంచి ప్రారంభమై కాకుపల్లి వరకు వెళుతుంది. సర్వేపల్లి కాలువలోని నీటిని ఈ కాలువ తీసుకెళుతుంది. నీలగిరి సంఘం నుంచి ప్రారంభమయ్యే పీటర్స్ కాలువ ఇస్కాన్ సిటీ వరకు ఉంటుంది. ఈ కాలువను ఇరువైపులా ఆక్రమించి భవనాలు నిర్మించారు. చాలా చోట్ల పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కలతో నిండిపోయింది. పూర్తిస్థాయిలో నీరు పారలేని దుస్థితిలో ఉంది. కంబాల కాలువ నవబాలదుర్గాదేవి ఆలయం నుంచి నారాయణరెడ్డి పేట వరకు సాగుతుంది. ఇది పూర్తిగా రూపుకోల్పోయింది. ఇక లోలెవల్ కాలువ బెడ్ ఏడు మీటర్లు ఉండాల్సిందిగా రెండు మీటర్లకు కుచించుకుపోయిందని గతంలో అధికారులు తేల్చారు. దీంతో ఆశించిన స్థాయిలో ఈ కాలువ గుండా నీరు పారలేని పరిస్థితి. ఉయ్యాల కాలువ పరిస్థితి కూడా అంతే. కనుపూరు కాలువ బ్రాంచి కెనాల్‌ను ఆక్రమించి భవనాలు నిర్మించారు. ఇవే కాదు ప్రధానమైన రామిరెడ్డి కాలువ, వెంగన్న కాలువలు కూడా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ కారణాల వల్లే నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఎక్కడికక్కడ నిలబడిపోతోంది.

నాడు రూ.82 కోట్లతో పనులు

నగరంలో 13 ప్రధాన కాలువలు ఉన్నాయి. ఇవన్నీ నెల్లూరు చెరువు నుంచి గ్రామీ ణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరు అందిస్తుంటాయి. అయితే కొన్నేళ్ల నుంచి నగరం క్రమేణా విస్తరిస్తుండటంతో వ్యవసాయ భూములు కూడా నివాస ప్రాంతాలుగా మారిపోతూ వస్తున్నాయి. దీంతో ఈ కాలువల్లో కొన్ని డ్రైనేజీ కాలువలుగా మారిపోయాయి. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీటిని నగరం వెలుపలకు తీసుకెళ్లాల్సినవి ఈ కాలువలే. వీటిలో ముఖ్యమైన రామిరెడ్డి కాలువ, కాకుపల్లి కాలువ, గుండ్లపాలెం కాలువ, లోలెవల్ స్లూయిజ్ కాలువ, వెంగన్న కాలువ, స్లూయిజ్ కాలువలను అభివృద్ధి చేసేందుకు 2018లో టెండర్లు పిలిచారు. సుమారు రూ.82 కోట్లతో కాలువలో బెడ్ నిర్మించడం, రెండు వైపులా లైనింగ్ ఏర్పాటు చేసే పనులు మొదలయ్యాయి. రామిరెడ్డి కాలువ, వెంగన్న కాలువల్లో కొంత మేర పనులు కూడా జరిగాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులు నిలిచిపోయాయి.



వాకర్స్‌రోడ్డులోని కాలువ దుస్థితి

రూ.176 కోట్లతో అంచనాలు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ప్రధాన కాలువలకు లైనింగ్, బెడ్ నిర్మించి ఆధునికీకరించేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు అంచనాలు రూపొందించారు. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలతో సుమారు 50 కిలోమీటర్ల మేర కాలువలను బాగు చేసేందుకు రూ.176 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఇంత మొత్తం మున్సిపల్ శాఖ నుంచి ఇవ్వడం కష్టమని భావించి రూ.50 కోట్లతో 14 కి.మీ మేర పనులను ఇరిగేషన్ శాఖ ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి పంపింది. మిగిలిన నిధుల కోసం మున్సిపల్ శాఖకు ప్రతిపాదనలు వెళ్లాయి. ప్రస్తుతం ప్రభుత్వ స్థాయిలో ఈ ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సీహెచ్‌సీలో విచారణ

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అల్లూరు వైద్యుడు వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. వైద్యశాలలో పని చేసే ఒక డాక్టర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఆరోపిస్తూ ఈనెల 11న కుటుంబ సభ్యులు దాడికి ప్రయత్నించారు. మరుసటిరోజే బాలిక కుటుంబ సభ్యులు డాక్టర్‌ను అపార్థం చేసుకున్నామని, అసభ్యకరంగా ప్రవర్తించలేదని క్షమాపణ కోరారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని ఆదేశించడంతో డాక్టర్ వెంకటేశ్వర్లు విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు.

రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు

- అధునాతనంగా పొదలకూరు బస్టాండు నిర్మాణం
- రీజియన్ చైర్మన్ సురేష్‌రెడ్డి వెల్లడి



పొదలకూరు బస్టాండును పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి తదితరులు

పొదలకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు త్వరలో 300 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆ సంస్థ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం పొదలకూరులోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాపూరు డిపో మేనేజరు అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పొదలకూరు బస్టాండ్ ప్రాంగణాన్ని 15 ఏళ్లపాటు ఓఎస్ కింద లీజుకు ఇచ్చామని, ఇందులో భాగంగా భవనానికి రంగులు వేయడంతోపాటు మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ప్రయాణికులకు వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు చెప్పారు. బస్టాండ్‌లో సిమెంటు ప్లాట్‌ఫారం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కాగా పొదలకూరు నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు బస్సులను నడపాలని, అలాగే తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల లోపల నెల్లూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పలువురు సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సర్వేపల్లి ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, నాయకులు సుబ్రహ్మణ్యం, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ వద్దు

- పేద, మధ్య తరగతికి వైద్య విద్య దూరం
- ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు



మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతనంగా రూపుదిద్దుకుంటున్న 17 వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని, ఇది ప్రజారోగ్యానికి హాని కలిగిస్తుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య వెల్లడించారు. మంగళవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగ స్వామ్యం (పీపీపీ) విధానంలో కొత్త వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇది అమలైతే ఆ వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద అమ్ముకునేందుకు ప్రణాళికలు రూపొందించిందని ఆరోపించారు. కేవలం ఏడాదికి రూ.15వేలు ఉండే వైద్య విద్య ఫీజును రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ ఫీజు రూ.20 లక్షలుగా నిర్ధారించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమేకాక రద్దు చేస్తామని ఎన్నికల్లో ప్ర కటించిన టీడీపీ, జనసేనలు గత ప్రభుత్వ విధానాలనే కొనసాగించేందుకు నిర్ణయించటం సరికాదన్నారు. దీని వల్ల భవిష్యత్తులో పేద, మధ్య తరగతి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినా భారీ ఫీజులు కట్టలేక వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ కొత్త వైద్య కళాశాలల్లో పీపీపీ పద్ధతి వద్దని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వివరించామని చెప్పారు. దీనిపై జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి జీ శ్రీనివాసరావు, కోశాధికారి సూర్యప్రకాశరావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలిస్తున్న సీఐ గంగాధర్

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఇటీవల వరుస ప్రమాదాల నేపథ్యంలో ప్రమాద నివారణ చర్యలు తక్షణమే తీసుకోవాలని రాష్ట్ర మంత్రి రామనారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. దీంతో పోలీసు లు ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఇరువైపులా ప్రమాదాల నివారణకు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ జీ. గంగాధర్ బారికేడ్స్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే డేంజర్ స్పాట్స్ దగ్గర ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బోర్డుల ఏర్పాటుతో వాహనాల వేగం తగ్గి నిదానంగా వెళ్లడంతో ప్రమాదాలు అరికట్ట వచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

గుళికలు తిని బాలిక ఆత్మహత్యాయత్నం

వెంకటాచలం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంగుంట ఎస్టీ కాలనీలో ఓ బాలిక గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు... తనకు ఇష్టంలేని పెళ్లి చేశారన్న మనస్థాపంతో నాలుగు రోజుల క్రితం ఓ బాలిక గుళికలు తిన్నది. వెంటనే గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించి, వైద్యం చేయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రి స్వాధీనం




అధికారులు స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం కొండపై మంగళవారం పోలీసు, అటవీ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించి పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన కొందరు యువకులు శనివారం రాత్రి దుర్గంపైగల పెద్దమసీదు వద్ద నిద్రించేందుకు వెళ్లారు. ఆ సమయంలో రామ్, కరీం బుగ్గ ప్రాంతంలో దీపాలు వెలుగుతుండడం, వ్యక్తుల సంచారం ఉండడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. తిరిగి ఆదివారం పట్టణానికి వస్తూ రాత్రి దీపాలు వెలుగుతున్న, వ్యక్తుల సంచార ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ జిలిటెన్ స్టిక్స్, ఇతరత్రా వస్తువులు ఉండడాన్ని గుర్తించి పరుగులు తీశారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో పాటు పట్టణంలో ప్రచారం జరిగింది. దీంతో మంగళవారం పోలీసు, అటవీ శాఖాధికారులను ఆ యువకులు వెంటబెట్టుకుని దుర్గంపై తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గుప్తనిధుల తవ్వకాల కోసం ఉంచిన 14 జిలిటెన్ స్టిక్స్, బ్యాటరీ, వైర్లు, ఇతరత్రా పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

సహచరులే చంపేశారు!

- నగరంలో యూపీ వాసి దారుణ హత్య
- సాంకేతికత ఆధారంగా నిందితుల గుర్తింపు
- తెనాలి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు?



మృతుడు జైహింద్ సహాని (ఫైల్)

నెల్లూరు (క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బతుకు తెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చారు. నెల్లూరులో ఓ గదిని అద్దెకు తీసుకొని రోజువారి పనులు చేసుకుంటూ పూట గడుపుతున్నారు. అంతా బాగున్నా వారిలో వారే గొడవ పడుతూ తమతో ఉన్న ఓ వ్యక్తిని బండరాయితో మోది హత్య చేశారు. అయితే, ఈ ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే సాంకేతికత ఆధారంగా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, సేకరించిన సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని శాంట్‌కబీర్‌నగర్ జిల్లా బాండ్ల గ్రామానికి చెందిన జైహింద్ సహాని (40), ఇంద్రావతి దంపతులకు ముగ్గురు సంతానం. మూడు నెలల కిందట జైహింద్ సహాని ఉత్తరప్రదేశ్‌లోని సిదార్ధనగర్‌కు చెందిన పరదేశి గౌతమ్, రామ్‌కేశరిలను వెంటబెట్టుకుని ఉపాధి కోసం నెల్లూరుకు వచ్చారు. శ్రీనివాస నగర్ ఒకటవ వీధిలో ఓ రేకుల ఇంటిని ఈ ముగ్గురు అద్దెకు తీసుకొని శివ అనే మేస్త్రీ వద్ద ఉడ్ పాలిష్ పనులకు చేరారు. అయితే, జైహింద్ సహాని మద్యం మత్తులో సహచరులను ఇబ్బందులకు గురిచేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ముగ్గురు మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ నెల 16వ తేదీ రాత్రి ముగ్గురూ భోజనం చేస్తుండగా గొడవ పడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన పరదేశిగౌతమ్, రామ్‌కేశరిలు పక్కనే ఉన్న బండరాయిని తీసుకొని జైహింద్ సహాని తలపై బలంగా మోదడంతో తలపగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో నిందితులు ఇంటి తలుపునకు గడియ పెట్టి అక్కడ నుంచి పరారయ్యారు.

మృతుడి బంధువులకే చెప్పి..

మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నిందితులు నవాబుపేటలో ఉన్న మృతుడి మేనకోడలు శకుంతలకు ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. 'మీ మామను చంపేశాం. వచ్చి చూసుకోండని అనడంతో ఆమె తన భర్త సోను సుహానికి చెప్పారు. దీంతో ఆయన హుటాహుటిన ఘటన జరిగిన ఇంటి వద్దకు చేరుకున్నాడు. తలుపులు తెరిచి చూడగా రక్తపు మడుగులో జైహింద్ సహాని మృతదేహం కనిపించింది. ఈ మేరకు ఆయన నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సాంకేతిక ఆధారంగా నిందితులు రైలులో పారిపోతున్నారని గుర్తించారు. తెనాలి సమీపంలో అక్కడి పోలీసుల సహకారంతో నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని, నెల్లూరుకు తీసుకొచ్చి విచారిస్తున్నట్లు సమాచారం. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

వరి, మొక్కజొన్న సాగుపై అవగహన

ఏఎస్‌పేట, జూన్17 (ఆంధ్రజ్యోతి): శ్రీకొలను, చిరమన గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు దేవసేనమ్మ వరి, మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు, మెలకువలపై, ఏవో సురేష్‌బాబు ప్రకృతి సాగుపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో మునెమ్మ, వీహెచ్ఏ సంధ్యారాణి, వీఏఏ తులసి, రైతులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9584
వెండి కిలో ధర	రూ. 109300
వెండి ఒక గ్రాము	రూ. 112.30



'అన్నదాత సుఖీభవ'కు ఈకేవైసీ నమోదు తప్పనిసరి

● కిశోర్‌బాబు, వ్యవసాయశాఖాధికారి, ఆత్మకూరు

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తోంది. రైతులందరూ తప్పని సరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కే. కిశోర్‌బాబు తెలిపారు.

?. ఆత్మకూరు మండలం నుంచి ఎంత మంది అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత పొందారు.

! అన్నదాత సుఖీభవ 2025-26కు గానూ మండలం నుంచి 6004 మంది రైతులు మాత్రమే అర్హత పొందారు.

?. అర్హత పొందని రైతులు ఏం చేయాలి

! ప్రతి రైతు తమ ఆధార్ నెంబర్‌ను భూమి, బ్యాంక్ ఎన్‌పీసీఐ లింక్, ఈకేవైసీ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ బెనిఫిట్ అందుతుంది.

?. రైతులకు ఈకేవైసీ కేంద్రాలు ఏర్పాటు చేశారా

! ఆయా సచివాలయాల పరిధిలోని రైతు భరోసా సేవాకేంద్రాలకు వెళ్లి రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చు.

? ఈ పథకానికి రైతులందరూ అర్హులేనా

! వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ సాగుచేసే రైతులు ఈ పథకానికి అర్హులు. సరుగుడు, జామాయిల్, ఎర్రచందనం పెంపకం చేసే రైతులు అనర్హులు.

?. రైతులకు సబ్సిడీపై పచ్చరొట్ట ఎరువులు అందజేస్తున్నారా

! జీలగలు, జనుము, పిల్లపెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నాం. జీలగలు కేజీ రూ. 61.50, జనుములు రూ. 54.50, పిల్లిపెసర విత్తనాలు రూ. 90లకు అందజేస్తున్నాం.

?. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నారా

! గత సంవత్సరం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు మంజూరు చేశాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంకా రాలేదు.



ఖాళీ మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలు



అపరిశుభ్రంగా మారిన బస్ షెల్టర్



సేద తీరుతున్న మందుబాబు

అధ్వానంగా బస్ షెల్టర్

● అవస్థల్లో ప్రయాణికులు

ఉదయగిరి రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లోని బస్ షెల్టర్‌లోకి ప్రస్తుతం అడుగు పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. స్థానికులతో పాటు పలు మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రయాణికులు నెల్లూరు, ఆత్మకూరు, కావలి, బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు, తిరుపతి వంటి పట్టణాలకు ప్రతినిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో కాసేపు సేద తీరేందుకు అక్కడికి పరుగులు తీసినప్పటికీ పట్టుమని పది నిమిషాలు కూడా ఉండలేక హడలెత్తిపోతున్నారు. ప్రాంగణమంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుండడంతో విసుగెత్తిన ప్రజలు చేసేదేమిలేక ఆరు బయట ఎండలోనే గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. మందుబాబులు సైతం తమ ఆగడాలకు అడ్డాగా మార్చుకోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. రాత్రి సమయాల్లో మద్యం సేవించి సీసాలు, ఇతర వ్యర్థాలను అక్కడే పడేస్తున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాక మద్యం మత్తులో అక్కడే సేద తీరుతుండడంతో మహిళలు, పిల్లలు భయాందోళనలతో వెనకడుగు వేయాల్సిన పరిస్థితి. దీంతో ఆ బస్‌షెల్టర్ పేరుకే అన్న చందంగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా రూ. లక్షలు వెచ్చించి బస్ షెల్టర్ నిర్మించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ఒకవైపు అపరిశుభ్రత, మరోవైపు దుర్వాసనతో బస్సుల కోసం వేచి చూడాల్సివస్తుందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను పరిశుభ్రంగా ఉంచి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయని, వాటి అభివృద్ధి కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కే. డేవిడ్‌రాజు కోరారు. ఈ మేరకు సీపీఎం, అనుబంధ సంఘాల నేతలతో కలిసి వెళ్లి మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ పట్టణంలోని జ్యోతినగర్, మిరియాలకట్ట వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలు, బీఎస్ఆర్ సెంటర్ సమీపంలో ఉన్న ముస్లిం స్మశాన వాటిక, అలాగే వందూరుగుంటలో ఉన్న క్రైస్తవుల సమాధుల తోటలో జంగిల్ క్లియరెన్స్ చేయించి రోడ్లు, తాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. అలాగే బొగ్గేరు దగ్గర ఉన్న శ్మశాన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, ఆవాజ్ నాయకులు యస్థానీ, శ్రీహరి, జిలాని పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రోడ్డు పక్కనే చెత్తా.. దుర్గంధం

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు-సోమశిల ప్రధాన రహదారి రేవూరు వద్ద చెత్తను రోడ్డు పక్కనే వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తెస్తున్నా, ఇక్కడ మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి రోడ్డు వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రేవూరు వద్ద రోడ్డు పక్కనే వేసిన వ్యర్థాలు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించి యోగాసనాల ప్రాధాన్యతను వివరించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ గురించి తెలియజేశారు. మోటార్‌బైకులు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెంట్ ధరలించాలని, మత్తు పానీయాలు సేవించరాదని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

కాలువల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాగరం చెరువు పరిధిలోని కాలువల అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు జయవర్ధన్‌ను మంగళవారం ఆయన కలిసి శాలువాతో సన్మానించి, ఆయకట్టు పరిధిలోని రైతుల సమస్యలను వివరించారు. కొంతకాలంగా పూడిక తీయకపోవడంతో కాలువలు అధ్వానంగా ఉన్నాయని, ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దారును సన్మానిస్తున్న నీటిసంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి

సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి మృతి అత్యంత బాధాకరం

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి జర్నలిస్ట్ రంగానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో భవాని సమేత జమ్ముమునేశ్వరస్వామి

40 రోజుల మండల పూజ

అనంతసాగరం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మినగుంట వద్ద వెలసి ఉన్న భవాని సమేత జమ్ముమునేశ్వర స్వామి ఆలయంలో 40 రోజుల మండల పూజ మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పుస్తకాల పంపిణీ

ఉదయగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం కార్యాలయంలో సీడీ పీవో సునీత పీపీ-1,2 పుస్తకా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారుల సంఖ్యను పెంచాలన్నారు. కేంద్రాలను చిన్నారులు ఆకర్షించేలా తీర్చిదిద్దాలన్నారు. విధుల్లో అలసత్వం వహించరాదని, కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. క్రమంలో సూపర్‌వైజర్లు షేక్ షాను, తేజస్విని, కార్యకర్తలు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్‌ల ఏర్పాటు



రెడ్డిగారిబావి వద్ద ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డిగారిబావి, గాజులవీధి సమీపంలో మంగళవారం టీడీపీ నాయకులు గాజుల షర్పుద్దీన్ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వీధుల్లో చెత్తాచెదారాన్ని రోజుల తరబడి తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు దోమల వృద్ధి అధికంగా ఉండడంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారన్నారు. వీధుల్లో చెత్తను తొలగించాలని, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినా పట్టించుకోలేదన్నారు. దీంతో తన సొంత నిధులతో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని అన్నివీధుల్లో డస్ట్‌బిన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

తల్లికి వందనం కార్యక్రమంపై ఆనందం

వింజమూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ పండుగ వాతావరణం ఏర్పాటు చేసుకున్నారని టీడీపీ మండల మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కార్యక్రమం విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు.

వైభవంగా ముగిసిన గంగాభవాని ఉత్సవాలు

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీఅనంతపూరి గంగాభవాని ఉత్సవాలు మంగళవారం బండ్లుపొంగళ్ల కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామపురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు ప్రారంభించారు. పోటీల్లో కడపకు చెందిన విద్యాటబుల్‌రెడ్డి ఎద్దులు ప్రథమ, బద్వేల్‌కు చెందిన వినుకొండ రఫీ ఎద్దులు ద్వితీయ, మర్రిపాడు మండలం తిక్కవరం గ్రామానికి చెందిన బాలనరసింహనాయుడు ఎద్దులు తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు ఆలయ కమిటీ రూ.20, రూ.15, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలో ఇటీవల నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకట్రావుపల్లికి చెందిన ఇద్దరు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున రూ.50వేల నగదును నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి అందజేసిన విషయం విదితమే. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 10న మృతి చెందిన మరో కుటుంబానికి మంగళవారం ఆయన పరామర్శించి రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కుడుముల సుధాకర్‌రెడ్డి, కట్టా మహేష్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలరు దగుమాటి శివకోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి



సిమెంట్ రోడ్డు పనులు చేస్తూ..

రూ. 4లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు

సంగం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి మజరా ఉడ్‌హౌస్‌పేట గ్రామంలో మంగళవారం సిమెండ్ రోడ్డు పనులు ప్రారంభించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిమెంట్ రోడ్డు పనులకు ఉపాధి హామి పథకంలో రూ. 4 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఆ మేరకు పనులు ప్రారంభించారు. దీంతో కాలనీవాసులు మంత్రి ఆనంకు, నిధులు మంజూరుకు కృషి చేసిన టీడీపీ మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఉక్కాల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S



హత్య వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

● వేధింపులు తాళలేక అఘాయిత్యం

నెల్లూరు(క్రైం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన భర్తను బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే సాంబ శివరావు మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. బాలాజీనగర్ వైకే ఆచారి స్కూలు వీధిలో ఎల్ విజయ్‌చంద్ర, శైలజ(46) దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. విజయ్ చంద్ర ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శైలజ తండ్రి చెన్నైలో ఉంటూ మృతిచెందారు. ఆయనకు చెందిన ఆస్తులు తమకు రావాలంటే కొంత నగదు ఖర్చు చేయాలని భర్తకు శైలజ చెప్పింది. అతని అంగీకారంతో కోర్టులో కేసు వేసి భర్తతో రూ.40 లక్షలకుపైగా అప్పు చేయించింది. ఈ అప్పుల కారణంగా విజయ చంద్ర పిల్లల ఫీజులు కట్టలేకపోయారు. ఇదిలా ఉండగా భర్తపై శైలజ అనుమానం పెంచుకుంది. ఆయన విధులకు వెళ్లినా వీడియోకాల్ చేసి వేధించేది. తరచూ భర్తతో గొడవపడుతూ ఉండేది. దీంతో ఎందుకలా చేస్తున్నావని కుమారులు కూడా తల్లిని ప్రశ్నించేవారు. భార్య వేధంపులు తాళలేక ఆమెను అంతమొందించాలని విజయచంద్ర నిర్ణయించుకున్నారు. ఈ నెల 14వ తేదీ పిల్లలిద్దరిని భోజనం తీసుకురావాలని బయటకు పంపారు. పథకం ప్రకారం భార్య గొంతుకు టవల్ బిగించి చంపేందుకు యత్నించాడు. ఆమె చావకపోవడంతో రోకలి బండతో బలంగా తలపై కొట్టాడు. ఆమె మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత పరారయ్యాడు. పెద్దకుమారుడు శ్యామ్ సాత్విక్ ఫిర్యాదుతో బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు విజయచంద్రను సోమవారం ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు అరెస్ట్ చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ కనపరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

దాడి కేసులో జనసేన నేతల అరెస్ట్

కావలి రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డిపాలెంలో ఈనెల 12న టీడీపీ, జనసేన నాయకుల మధ్య జరిగిన ఘర్షణ కేసులో మంగళవారం పలువురు జనసేన నాయకులను అరెస్ట్ చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు, చిన్నపిల్లల క్యారమ్ బోర్డు ఆట వద్ద జరిగిన వివాదంలో వడ్డిపాలెంకు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ పల్లపు పద్మ పై అదే ప్రాంతానికి చెందిన జనసేన నాయకుడు మస్తాన్ తోపాటు మరో ఆరుగురు దాడి చేశారు. మస్తాన్ భార్య ప్రసన్న కటింగ్‌బ్లేడుతో పద్మ పెదవిపై వత్తటంతో తీవ్రగాయమైంది. దీంతో పద్మ ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ ఎస్ఐ జమాల్‌వలి ఏడుగురికి అరెస్ట్‌చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తూనికల, కొలతల అధికారి ఆకస్మిక తనిఖీ

● రూ. 25 వేల వరకు జరిమానా

సంగం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సంగంలోని పలు దుకాణాలను కావలి డివిజన్ తూనికల, కొలతల (లీగల్ మెట్రాలజీ) శాఖ ఇన్‌స్పెక్టర్ మోహిస్సీన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో తూనికల కొలతల రాళ్లు, కాటాల్లో తేడా, వాటిపై తూనికల, కొలతలశాఖ ముద్రలు లేకపోవడంతో జరిమానా విధించారు. ఐదు దుకాణాలపై సుమారు రూ. 25 వేల వరకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అధికారుల దాడులు గమనించిన పలువురు దుకాణాదారులు అంగళ్లను మూసివేశారు.

పాత కక్షలతో దాడి: వ్యక్తికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాత కక్ష్యలను దృష్టిలో ఉంచుకుని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని నర్రవాడ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నర్రవాడ గ్రామానికి చెందిన శివకుమార్‌కు అదే గ్రామానికి చెందిన కొంతమందితో పాత కక్ష్యలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బ్రహ్మోత్సవాలను చూసి గుడిగంట్ల ఉదయ్‌కుమార్‌తో కలిసి పచ్చవ శివ ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. జనార్ధనస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి గ్రామానికి చెందిన పచ్చవ వెంగళరావు, పచ్చవ వెంగయ్య, తిరివీధి శ్రీనివాసులు, తిరివీధి చెన్నకేశవులు, మాతంగి రామకృష్ణ, తిరివీధి రాధాకృష్ణ ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి శివపై దాడి చేశారు. ఈ దాడిలో అతని తలపై తీవ్ర గాయమైంది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ ఆదిలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే

● నిరుపేద మహిళ ఇంటికెళ్లి సమస్య తెలుసుకుని .. ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థికసాయం

● కుటుంబానికి అండగా ఉంటానని కాకార్ల భరోసా

ఉదయగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షబ్బీర్ కాలనీకి చెందిన నిరుపేద మహిళ సమస్యపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తక్షణమే స్పందించారు. భర్తను కోల్పోయి నలుగురు ఆడపిల్లలతో కుటుంబ పోషణ భారమై, వారిని చదివించలేక ఆర్థిక ఇబ్బందులతో జబీన అనే మహిళ సతమతమవుతోంది. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో జరిగిన తప్పిదంతో ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే టీడీపీ నాయకులు, అధికారులతో మంగళవారం రాత్రి ఆమె నివాసానికి వెళ్లారు. సమస్యలపై ఆమెతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో, తహసీల్దారు, హౌసింగ్ అధికారులతో అక్కడికక్కడే చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో జరిగిన తప్పిదాన్ని సవరించి ఆమె కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీవో అప్పాజీకి సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆమె కుమార్తె చదువుకు అవసరమైన ఆర్థికసాయాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. సొంత ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. తన ట్రస్టు ద్వారా ఖర్చుల నిమిత్తం తక్షణసాయం కింద రూ.50 వేలు అందజేశారు. స్థానిక నాయకులు, ప్రభుత్వం అండగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, సందానీ, షర్పుద్ధీన్, గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

కొండాపురం (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు మంగళవారం తహసీల్దార్ కోటేశ్వర రావుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు తక్ష ణమే పేస్కేలును అమలు చేయాలన్నారు. అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్‌వోలుగా ప్ర మోషన్లు ఇవ్వాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియ మించాలన్నారు. అటెండర్, నైట్ వాచ్‌మన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుంచి 70 శాతం వరకు పెంచాలన్నారు. తమకు కేటాయిస్తున్న అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు.


తహసీల్దార్‌కి వినతిపత్రం అందచేస్తున్న వీఆర్ఏలు

న్యూస్ బాక్స్

వైభవంగా పోలేరమ్మకు మాస పొంగళ్లు


పోలేరమ్మకు నిర్వహించిన పూలంగిసేవ

బిట్రగుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని పోలేరమ్మకు ఉత్సవాల అనంతరం మాస పొంగళ్ల కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. త్రిపుర కన్‌స్ట్రక్షన్ అధినేత పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు అభిషేకాలు, ప్రత్యేక పూలంగిసేవ, అన్నసంతర్పన ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మకు పొంగళ్లు పొంగించి నైవేద్యంగా అర్పించారు. ఈ కార్యక్రమంలో పసులేటి వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ దంపతులతోపాటు పెద్ద కాపు జనార్దన్‌రెడ్డి, కమిటీ సభ్యులు గుంజి వెంకటేశ్వర్లు, కడియాల వెంకయ్య, పీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు లోగ్రేడ్ క్వింటా రూ. 20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని తెలుగురైతు మండల ప్రధాన కార్యదర్శి గుర్రం లక్ష్మీనరసింహం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అసలే ఈ ఏడాది అధిక వర్షాలు వలన తెగుళ్లు వ్యాప్తి చెంది నాణ్యమైన పొగాకు దిగుబడులు రాలేదని తెలిపారు. అంతేకాక ఇబ్బడిముబ్బడిగా ఖర్చులు పెరిగిపోయాయని ఆయన తెలిపారు.ఈ తరుణంలో పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

121 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 510పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 389బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-94, ఆర్ఆర్-11, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 121బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.252.17గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యామిత్ర కిట్లను పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ విజయకుమార్

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు కూచిపూడి విజయ్‌కుమార్ తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కమల్‌కుమార్, ఎంఈవో మల్లికార్జునరావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను అంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతు సదస్సును విజయవంతం చేయండి

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే. వీరారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులకు గిట్టుబాటు ధరల కల్పన కోసం వివిధ రైతుసంఘాలు, రైతులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్

లింగసముద్రం జూన్ 17 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్ సీతామహలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ హాజరవుతారని ఆమె చెప్పారు. భూసమస్యలతోపాటు ఇతర సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మండల అధికారులంతా కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె వివరించారు.

పంటలు సాగయ్యాక భూసార పరీక్ష ఫలితాలా ?

● ప్రతిఏటా ఇదే తంతు ● నష్టపోతున్న రైతులు

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేల స్వభావానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. నేల స్వభావం, అందులో ఏ స్థాయిలో ప్రథమ పోషకాలు ఉన్నాయి. ద్వితీయ పోషకాలు ఎలా ఉన్నాయి. సూక్ష్మపోషకాలు ఎంత ఉన్నాయి. భూమిలో ఉన్న పోషక విలువలు గురించి రైతులకు తెలియజేసి ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించి, ఖరీఫ్‌లో పంటల సాగుకు రైతులను వ్యవసాయాధికారులు సిద్ధం చేయాలి. సాధారణంగా ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్, నెలల్లో వ్యవసాయశాఖ అధికారులు రైతుల నుంచి మట్టి నమూనాలను సేకరిస్తారు. ఈ ఏడాది కూడా అలాగే మట్టి నమూనాలను సేకరించారు. కానీ ఖరీఫ్ ప్రారంభ అయినా కూడా ఇంత వరకూ భూసార పరీక్ష ఫలితాల పత్రాలను మాత్రం రైతులకు ఇవ్వలేదు. టెస్టింగ్ కోసం మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించే సరికి ఖరీఫ్ సీజన్ పూర్తి అయిపోయి రబీ సీజన్ కూడ ప్రారంభం అవుతుంది. వలేటివారిపాలెం మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 738 మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అయితే ప్రతి ఏటా పంటలు సాగు చేసిన తరువాత మట్టి నమూనా పరీక్ష ఫలితాలు వస్తున్నాయి. ఈ పరీక్ష ఫలితాల కోస రైతులు ఎదురుచూడకుండా తమకు అవగాహన మేరకు పంటలు సాగు చేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలోనే ఫలితాలను ఇస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.


కొండసముద్రంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖాధికారులు (ఫైల్)

ఫలితాలు రాగానే అవగాహన కల్పిస్తాం



మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 738 మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. ఫలితాలు వచ్చిన వెంటనే రైతులకు పంటలు, ఎరువులపై అవగాహన కల్పిస్తాం. త్వరలోనే ఫలితాలు వస్తాయి.

\- శేషారెడ్డి, ఏవో

నాడు నిర్లక్ష్యం.. నేడు బాధ్యతాయుతం !

● ధ్వంసం చేసిన కలుజు గోడ పునఃనిర్మాణంతో రైతుల హర్షం



వైసీపీ హయాంలో పగలగొట్టిన చెరువు కలుజు గోడ, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పునర్‌నిర్మించిన చెరువు కలుజు గోడ

అల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో కొంతమంది నాయకులు స్వార్థంతో అల్లూరు చెరువు రెండో లెవల్ కలుజు గోడను ధ్వంసం చేశారు. చేపలు పట్టుకొని లాభార్జన పొందాలనే కారణంతో నిండుకుండలా తొణికిసలాడే చెరువులో నీటి మట్టాన్ని తగ్గించేందుకు ఈ కలుజు గోడను ధ్వంసం చేశారు. దీనిపై గతంలో అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు బీద గిరిధర్ సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రైతులకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు అవసరమయ్యే చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా కలుజు గోడను మంగళవారం పునఃనిర్మించారు. దీంతో 8.2 అడుగుల నీటి మట్టం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ఆయన చర్యలు తీసుకున్నారు.

టీడీపీ నేతకు పలువురి నివాళి


నాగేశ్వరరావు, ఖాదర్‌బాషా చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్, జర్నలిస్టులు

కావలి,జూన్17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష పార్థివదేహానికి మంగళవారం ఇస్లాంపేటలోని ఆయన ఇంటివద్ద, పలువురు నివాళులు అర్పించారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో పలువురు నాయకులు నివాళులు అర్పించారు. ఖాదర్‌బాష రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, దావులూరి దేవకుమార్, బొట్లగుంట శ్రీహరినాయుడు, శానం హరి అర్షియాబేగం,రఫీ, కిరన్, రహీం, మస్తాన్, నారాయణ , నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణ ఏరియావైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో టీడీపీ నేత ఖాదర్‌బాషతోపాటు సోమవారం మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు చిత్రపటాలను ఏర్పాటుచేసి సంతాప సభ నిర్వహించారు. ఈ శిబిరంలో ఫొటోగ్రాఫర్స్, పలువురు జర్నలిస్టులు, పట్టణ ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు. అలాగే జర్నలిస్ట్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించి, నివాళులు అర్పించారు.

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి




కందుకూరు : పలుకూరులో మాట్లాడుతున్న ఏడీఏ అనసూయ, ఉలవపాడు : రైతులతో మాట్లాడుతున్న ఏవో విజయ్‌కుమార్, గుడ్లూరు : పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రవికుమార్

వలేటివారిపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) పచ్చిరొట్ట విత్తనాలను రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోలినేనిచెరువు, అంకభూపాలపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు పచ్చిరొటట్ట విత్తనాలయిన జీలుగ, జనుము, పిల్లిపిసర విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచిరొట్ట విత్తనాల వలన భూసారం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు, రవీంద్ర, ప్రభు పాల్గొన్నారు.

● **కందుకూరు** : అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు బదిలీ జరుగుతుందని ఏడీఏ పీ. అనసూయ తెలిపారు. మండలంలోని పలుకూరు, పందలపాడు గ్రామాల్లో మంగళవా రం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఏవో అ బ్దుల్‌రహీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏడీఏ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన రైతులందరినీ లబ్ధిదారులుగా నమో దు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేర కు నగదుసహాయం ప్రతిరైతు పొందుతార న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకు లు, రైతులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : ఎడ గారులో ఎరువుల నియత్రణ విధిగా పాటించా లని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పా ల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● **ఉలవపాడ** : ఖరీఫ్‌లో పచ్చిరొట్ట పైర్ల సాగుకు ప్రస్తుత వాతా వరణం అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌కుమార్ రైతు లకు సూచించారు. ఉలవపాడు సచివాలయం 1,2 రైతు సేవా కేంద్రం పరిధిలోని కొల్లూ రుపాడు, రాజుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు దున్నుకొని పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాల న్నారు. విత్తనాల కోసం రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ నెంబరుతో దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి పర్మిట్లు రాయించుకోవాలని ఏవో తెలిపారు.

● **గుడ్లూరు** : అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిపొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవాలని మండల ఏవో రవికుమార్ మంగళ వారం తెలియజేశారు. మండలంలోని పరకొండ పాడు అగ్రహారంలో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో ఏవో మా ట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి అ ర్హులైన రైతుల జాబితా సచివాలయ కేంద్రాల్లో ఉంచామన్నారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులకు అన్నదాత సుఖీభవ వర్తించదని పే ర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకుల తోపాటు, వ్యవసాయ సహాయకులు అనిల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి


కందుకూరులో పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, రైతు సంఘాల నేతలు

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధరకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి కొనుగోళ్లు చేయించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, రైతుసంఘాల నేతలు డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య, సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య, స్థానిక రైతుసంఘాల నేతలు మంగళవారం కందుకూరులోని వేలం కేంద్రాలను సందర్శించారు. వేలం తీరును పరిశీలించారు. అనంతరం పామూరురోడ్డులోని కందుకూరు 2 వేలం కేంద్రంలో రైతుసదస్సు నిర్వహించారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో మూలే వెంగయ్య మాట్లాడుతూ గరిష్ఠ ధర రూ. 280 చూయిస్తున్నప్పటికీ లోగ్రేడ్‌లను రూ. 180కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో సరాసరి ధరలు దారుణంగా పడిపోతూ రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య తదితరులు మాట్లాడారు. సదస్సులో రైతుసంఘాల నాయకులు కే. వీరారెడ్డి, ఎస్ఏ గౌస్, జీ. వెంకటేశ్వర్లు, బీ. సురేష్‌బాబు, తానికొండ రమణయ్య, జీవీబీ కుమార్, పొగాకు రైతులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష


యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై విజయనగరం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాష్ట్రమంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఇంటూరి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వివిధ కమిటీలు ఏర్పాటుచేయగా అందులో ఎమ్మెల్యే ఇంటూరి కూడా సభ్యుడిగా ఉన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్

కావలి రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐకాన్ సెంటర్ వద్ద ఇటీవల జరిగిన ఆత్మీయ సమావేశం లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పై ఫ్లెక్సీల విషయం లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన దామెర్ల శ్రావణ్ కుమార్‌ను మంగళవారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరువర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గౌస్ బాష ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చగా, ఈ నెల 30 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

మలేరియా నిర్ధారణకు రక్తనమూనాలు సేకరించాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ


దోమల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధిని నిర్ధా రించేందుకు జ్వరపీడితుల రక్త నమూనాలను సేకరించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదే శించారు. మంగళవారం నగరంలోని పడారు పల్లి, అనగుంట పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఏఎన్ఎంలు జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరిస్తు న్నారా?, వాటిని ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షిస్తున్నారా? అని ప్రశ్నించారు. లార్వా, ఫీవర్ సర్వేల తీరును పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దోమల వల్ల అనేక ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సచివాలయం ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గేటు లేక మందుబాబుల సంచారం


మంచినీటి ట్యాంకు చుట్టూ గేటు లేని ప్రహరీ

లింగసముద్రం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలోని జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న మంచినీటి ట్యాంకు చుట్టూ ఉన్న ప్రహరీ గోడకు గేటు లేదు. దీంతో ఇది మందుబాబులకు నిలయంగా మారింది.ఈ ట్యాంకు వద్ద ప్రతిరోజూ కొందరు ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారు. దీంతో పగిలిన గాజు ముక్కలు నీటిని విడుదల చేసే వారికి గుచ్చుకొంటున్నాయి. అధికారులు స్పందించి గేటు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు


వాకమళ్లవారిపాలెం ఆనకట్ట వద్ద ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై తారు, మెటల్ లేచిపోయి గుంతలు పడి దారుణంగా తయారైంది.దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఈ రోడ్డుపైన గుంతలు పెద్దవై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ దుకాణం కోసం వినతి

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అరుంధతీవాడలో రేషన్ షాప్ కోసం జనసేన నాయకురాలు కొండాపురం కస్తూరి ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరుంధతీవాడలో 300లకుపైగా కుటుంబాలు ఉన్నాయని, ఉన్నతాధికారులు స్పందించి రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ధ్యేయం


మాట్లాడుతున్న బ్రహ్మానందం

బిట్రగుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతో నారాయణ ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించామని షిరిడీ శేషసాయి మందిర వ్యవస్థాపకుడు కే. బ్రహ్మానందం అన్నారు. బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకా నగరులోని శేషసాయి మందిరం ఆవరణంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ వైద్యశాల వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిమందిర సేవకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ వద్ద మరమ్మతులు.. ఆగిన రాకపోకలు


రైల్వే ట్రాక్ అండర్ పాస్ వద్ద చేస్తున్న మరమ్మతులు

కావలి, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద రైల్వే ట్రాక్ కింద అన్నపుగుంటలో నుంచి పాపిరెడ్డి చెరువులోకి వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసి ఉన్న అండర్‌పాస్ వద్ద మంగళవారం మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఆటంకం ఏర్పడింది. మురుగునీరు పైన పారకుండా ఉండేలా దాని కింద పైపులైను వేసే కార్యక్రమం చేపట్టారు. పైపులు వేసేందుకు తవ్వుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచాయి.

రోడ్డు వెంబడి వాహనాలు!

● ప్రజల రాకపోకలకు ఇక్కట్లు


ఆర్వోబీ వంతెన కింద మరమ్మతుల కోసం వచ్చిన మోటారుసైకిళ్లు

కావలి,జూన్17(ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్వోబీ వంతెనకు ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్ల వెంబడి మోటారుసైకిల్ మెకానిక్ షాపులు ఏర్పాటు చేశారు. ఆ షాపుల వద్దకు మరమ్మతుల కోసం వచ్చిన మోటారుసైకిళ్లను వంతెన కిందనే కాకుండా దాని వెంబడి ఉన్న సర్వీస్ రోడ్లలో కూడా పెడుతున్నారు. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ముఖ్యంగా ప్రైవేట్ వైద్యశాలలు అన్నీ ఆ ప్రాంతంలో ఉండటంతో రోడ్లపై ఉన్న మోటారు సైకిళ్లతో రాకపోకలకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ ఆక్రమించినా మున్సిపల్ అధికారులుకాని, పోలీస్‌లు కాని పట్టించుకోవటంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మోటారుసైకిళ్లతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

కొడవలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగడిచెలిక పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై డీఎల్‌పీవో వెంకట్ మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రేగడిచెలిక పంచాయతీలో పారిశుధ్యం, రోడ్ల నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అభియోగంపై రికార్డులు పరిశీలించామని, ఈ అంశంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ అధికారులు, తదితరులు ఉన్నారు.

లిక్కర్ స్కామ్ కేసులో తండ్రీకొడుకులు

ఉక్కిరిబిక్కిరి అవుతున్న వైసీపీ శ్రేణులు

కలకలం



తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):మంచితనం, మర్యాద, క్రమశిక్షణ, నైతిక విలువలు అంటూ పదేపదే వల్లెవేసే తండ్రీ తనయులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మోహిత్‌రెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో నిందితులుగా మారడం రాజకీయవర్గాల్లో కలకలం రేపుతోంది. గతేడాది ఎన్నికల పోలింగ్ మరుసటి రోజు టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడి ఘటన చెవిరెడ్డి రాజకీయంలో కొత్త కోణాన్ని ఆవిష్కరించగా, ఇప్పుడు లిక్కర్ స్కామ్ కేసులో తండ్రీ తనయులిద్దరూ నిందితులుగా నమోదు కావడంతో అటు జిల్లాలోనూ, ఇటు సొంత నియోజకవర్గంలోనూ వైసీపీ శ్రేణుల నైతిక స్థైర్యం దెబ్బతింటోంది. శ్రీలంక రాజధాని కొలంబో వెళ్లడానికి మంగళవారం ఉదయం బెంగళూరు విమానాశ్రయం చేరుకున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డిని ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఆయనపై ఏపీ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన క్రమంలో ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పోలీసులకు అప్పగించారు. వీరి సమాచారంతో ఆయన్ను అదుపులోకి తీసుకోవడానికి ఏపీ నుంచి సిట్ అధికారులు బెంగళూరు బయల్దేరి వెళ్లారు. గతేడాది జూలై 27న స్నేహితుడి పెళ్లికని దుబాయ్ వెళ్లేందుకు యత్నించిన చెవిరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డిని లుకౌట్ నోటీసుల కారణంగా ఇమిగ్రేషన్ అధికారులు బెంగళూరు ఎయిర్‌పోర్టులో అడ్డుకున్నారు. ఆపై తిరుపతి నుంచీ పోలీసు అధికారులు వెళ్లి ఆయన్ను తీసుకొచ్చి 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి పంపించేసిన సంగతి తెలిసిందే. తాజాగా లిక్కర్ స్కామ్ కేసులో చెవిరెడ్డి ప్రమేయముందంటూ సిట్ అధికారులు ఆయనతో పాటు అతడి సన్నిహితుల కార్యకలాపాలను లోతుగా తవ్వి తీస్తున్నారు. అందులో భాగంగా తొలుత ఆయన వద్ద గతంలో గన్‌మెన్‌గా పనిచేసిన గిరిని, తర్వాత మదన్‌రెడ్డిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించడం ద్వారా రాబట్టిన సమాచారంతో చెవిరెడ్డి వద్ద గతంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన బాలాజీని కూడా అదుపులోకి తీసుకున్నారు. చెవిరెడ్డి ప్రమేయం లిక్కర్ స్కామ్‌లో ఉందని వారితో చెప్పించేందుకు వేధించారని, చిత్రహింసలు పెట్టారన్న ఆరోపణలు పక్కన పెడితే.. సిట్ వీరిని విచారించడం ద్వారానే కేసులో చెవిరెడ్డిని, ఆయన తనయుడిని 38, 39 నిందితులుగా చేర్చింది. తనను లిక్కర్ స్కామ్‌లో ఇరికించేందుకు తనవద్ద గతంలో పనిచేసిన వారిని వేధిస్తున్నారంటూ ఆరోపించిన చెవిరెడ్డి ఓ దశలో తనను త్వరలో అరెస్టు చేస్తారంటూ ప్రకటించారు. ఆయన ఏ ఉద్దేశంతో ఆ ప్రకటన చేసినప్పటికీ మంగళవారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గాలతో పాటు చెవిరెడ్డి అనుచరవర్గం ఉక్కిరిబిక్కిరవుతోంది.



అధికారులతో సమీక్షిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

కొవిడ్ కట్టడికి సిద్ధంగా ఉండండి

తిరుపతి(వైద్యం), జూన్ 17(ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు ఏ క్షణాన పెరిగినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని కట్టడి చేసేదిశగా ప్రతీ ఒక్కరూ సిద్ధంగా ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్‌లోని వైద్య విభాగాధిపతులు, అధికారులతో ఆయన మంగళవారం కొవిడ్‌పై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొవిడ్ కేసులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన వైద్య సామగ్రిని, పడకలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కొవిడ్ వార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరు పడకలతో పాటు అవసరం మేరకు పడకలను పెంచేందుకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కొవిడ్ బాధితులకు అవసరమైన వైద్యసేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కొవిడ్‌ను ఎలా కట్టడి చేయాలి, ముందస్తు ఏర్పాట్లు వంటి విషయాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు అలోక్ సమంత్రే, వెంకట్రమణ, భార్గవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మప్రచారం కోసం

ఏటా రూ.120కోట్ల ఖర్చు

చిత్తూరు జిల్లాలో 141 ఆలయాల నిర్మాణానికి ఆమోదం

మానవీయ విలువలపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు

టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయాలను వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు

6లో



చివరి కోత వరకు

మామిడికి సబ్సిడీ అందిస్తాం

- కాయలు పక్వానికి రాకముందే కోయొద్దు
- రైతులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచన
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 0877-2236007 ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'చివరి పంట వరకు మామిడికి సబ్సిడీ అందిస్తాం. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. కాయలు పక్వానికి వచ్చాకే కోసి గుజ్జు తయారీ పరిశ్రమకు తీసుకురండి' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు నష్టపోకుండా తోతాపురికి మద్దతు ధర రూ.12గా నిర్ణయించడం జరిగిందని, అందులో ప్రాసెసింగ్ యూనిట్ వారు రూ.8, మరో రూ.4 ప్రభుత్వం సబ్సిడీగా చెల్లిస్తుందన్నారు. చివరి కోత వరకు కూడా రూ.4 సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందని స్పష్టంచేశారు. మామిడి రైతుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను 0877-2236007 నెలంబరులో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. మామిడి గుజ్జు పరిశ్రమల వారు సిండికేట్ అయి రైతులకు అన్యాయం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మామిడి సీజన్ ముగిసే వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమలు, మండీలు, ర్యాంపుల వద్ద అధికారులను నియమించామని, వారు రైతులకు సహకరిస్తారన్నారు. కాగా, ఈ ఏడాది తోతాపురి దిగుబడి పెరగడం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో మామిడి పల్ప్ ఎగుమతి తగ్గడంతో సమస్య తలెత్తిందన్నారు. తమిళనాడు, కర్ణాటకలో మామిడి గుజ్జు పరిశ్రమల నుంచి పార్లే, కోకకోలా, పెప్సీ కంపెనీ వాళ్లు కొన్నారని, దీంతో రెండేళ్లుగా మన జిల్లాలో పరిశ్రమల్లో మామిడి గుజ్జు నిల్వలు ఉండిపోయినట్లు చెప్పారు. గడిచిన వారం నుంచి జిల్లాలో రోజుకు 2వేల టన్నుల చొప్పున తోతాపురి కొనుగోలు జరుగుతోందని, ఇప్పటి వరకు 16వేల టన్నులు ప్రాసెస్ చేశారని వివరించారు. రూ.4 సబ్సిడీ వల్ల ఉమ్మడి జిల్లాలోని రైతులకు రూ.170 కోట్ల లబ్ధి కలగనుందన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సబ్సిడీ అందుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్ప్ ఫ్యాక్టరీలకు కలెక్టర్, జేసీ - 6లో

రెవెన్యూశాఖలో భారీగా బదిలీలు



- 19 మంది తహసీల్దార్లు, 21మంది డీటీలకు స్థానచలనం

రెవెన్యూశాఖలో ప్రక్షాళనకు కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీకారం చుట్టారు. 19 మంది తహసీల్దార్లు, 21 మంది డిప్యూటీ తహసీల్దార్లను మంగళవారం బదిలీ చేశారు. ఏళ్ల తరబడి తిష్టవేసి తిరుపతిలో ఉన్న కొంతమంది డీటీలను ఇతర మండలాలకు బదిలీ చేశారు. ఏళ్ల తరబడి కొందరు రెవెన్యూ అధికారులు తిష్టవేయడంపై 'కదలరు.. వదలరు' శీర్షికన ఈ నెల 7న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపైనా కలెక్టర్ దృష్టి పెట్టారు. చాలా ఏళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రభుత్వాలు మారినా నేతలను అడ్డం పెట్టుకుని అదే ప్రాంతంలో పనిచేస్తున్న కొంతమంది అధికారులకు చుక్కెదురైంది. వారిని వేరే మండలాలకు బదిలీ చేశారు. ఇక, ఆర్ఐలు, వీఆర్వోల బదిలీలకు కసరత్తు జరుగుతోంది. దాదాపు బుధవారం వీరి బదిలీలు ప్రకటించే అవకాశం ఉంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

తహసీల్దార్ల బదిలీలు ఇలా..

తిరుపతి అర్బన్ తహసీల్దారు కేవీ భాగ్యలక్ష్మిని చిన్నగొట్టిగల్లుకు.. అక్కడ పనిచేస్తున్న కె.జనార్దనరాజును శ్రీకాళహస్తికి, జిల్లా సివిల్ సప్లైస్‌లో పనిచేస్తున్న రోశయ్యను కేవీబీపురానికి, కలెక్టరేట్ ఏవో భారతిని తొట్టంబేడుకు, అక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌రావును కలెక్టరేట్‌కు నియమించారు. కలెక్టరేట్ ఏవోగా రమేష్‌బాబు నియమితులయ్యారు. సత్యవేడు తహసీల్దారు టీవీ సుబ్రహ్మణ్యంను పిచ్చాటూరుకు, వరదయ్యపాళెంలోని రాజశేఖర్‌ను సత్యవేడుకు, శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీదేవిని బుచ్చినాయుడుకండ్రిగకు రెగ్యులర్ చేశారు. శ్రీకాళహస్తిలోని లక్ష్మీనారాయణను కలెక్టరేట్‌కు కేటాయించారు. శాంతిని శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు. సూళ్లూరుపేటలోని నరసింహరావును వెంకటగిరికి, చిట్టమూరుకు సతీష్‌కుమార్‌ను, కలెక్టరేట్‌లో ఉన్న ద్వారకనాథరెడ్డిని బాలాయపల్లికి కేటాయించి డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు నియమించారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన సయ్యద్ ఇక్బాల్‌ను కలెక్టరేట్‌కు కేటాయించారు. కలెక్టరేట్‌లోని ఇ సెక్షన్‌లో పనిచేస్తున్న హరికృష్ణను పెళ్లకూరుకు, చిల్లకూరు తహసీల్దారుగా శ్రీనివాసులును నియమించారు.

21 మంది డీటీలు కూడా..

చిన్నగొట్టిగల్లు ఆర్ఎస్(రీసర్వే)డీటీగా భాస్కర్, ఎర్రావారిపాళెం వాసు దేవకుమార్, అక్కడ పనిచేస్తున్న రూప్‌చంద్‌ను వడమాలపేటకు కేటాయించారు. అక్కడ పనిచేస్తున్న సుధీర్‌ను వరదయ్యపాళెం ఇన్‌ఛార్జి తహసీల్దారుగా నియమించారు. కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని కలెక్టరేట్‌కు కేటాయించారు. నారాయణవణంలో హరికృష్ణను చిన్నగొట్టిగల్లుకు.. నాగరాజును బీఎన్‌కండ్రిగకు.. చంద్రబాబును పిచ్చాటూరుకు.. పిచ్చాటూరులోని ఆర్ఎస్ డీటీ చెంచయ్యను కలెక్టరేట్‌కు, తొట్టంబేడులో పనిచేస్తున్న జగన్‌మోహన్‌ను శ్రీకాళహస్తి ఆర్ఎస్ డీటీగా నియమించారు. శ్రీకాళహస్తిలోని ప్రేమ్‌కుమార్‌ను డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి కేటాయించారు. తిరుపతి అర్బన్ సీఎస్ (సివిల్ సప్లయిస్) డీటీగా పనిచేస్తున్న సురేంద్రను చంద్రగిరి సీఎస్ డీటీగా, చంద్రగిరిలో పనిచేస్తున్న గంగయ్యను తిరుపతి అర్బన్ సీఎస్ డీటీగా, కలెక్టరేట్‌లోని జీవన్‌కుమార్‌ను తొట్టంబేడుకు, అక్కడి భానుచంద్‌ను నారాయణవనానికి, వెంకటగిరి సీఎస్‌డీటీ గోపీనాథ్‌ను సూళ్ళూరుపేట ఇన్‌ఛార్జి తహసీల్దారుగా, సీఎస్ డీటీగా ఉన్న మల్లికార్జున్‌ను కోట మండలానికి, అక్కడ పనిచేస్తున్న అజంతుల్లాను వాకాడు సీఎస్‌డీటీగా రెగ్యులర్ చేశారు. సూళ్ళూరుపేటలోని సంధ్యను అక్కడి ఆర్డీవో కార్యాలయానికి కేటాయించారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన గణేష్‌బాబును సూళ్ళూరుపేట ఆర్ఎస్ డీటీగా నియమించారు. తిరుపతి అర్బన్‌లో పనిచేస్తున్న రామచంద్రయ్య జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

రేపు ప్రజా విచారణ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుందార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ నెల 19వ తేదీ గురువారం ప్రజా విచారణ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మహిళల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి గాను ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తిరుపతి, సమీప జిల్లాల మహిళలు ఎవరైనా తమ సమస్యలను జాతీయ మహిళా కమిషన్ దృష్టికి ఫిర్యాదుల రూపంలో అందించవచ్చని కలెక్టర్ తెలిపారు.

'తల్లికి వందనం' అందని వారికి ఊరట

తిరుపతి కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల వల్ల 'తల్లికి వందనం' పథకం నిధులు అందని వారికి ప్రభుత్వం ఊరట కల్పించింది. అనర్హుల జాబితాలో ఉన్నవారు సవరణ చేసుకోవడానికి అవసరమైన గ్రీవెన్స్ దరఖాస్తు ఫారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫారం పూర్తిచేసి ఈనెల 20వ తేదీలోపు సంబంధిత సచివాలయాల్లో ఇవ్వాలి. పూర్తిస్థాయిలో పరిశీలించి జూలై 5వ తేదీన తల్లికి వందనం నగదును తల్లి ఖాతాలో జమ చేస్తారు.

ఇదేనా 'చాళుక్య' నీతి?

- కార్పొరేషన్ స్థలంపై కూటమి స్కాం అంటూ వైసీపీ దుష్ప్రచారం
- నేడు కౌన్సిల్ సమావేశంలో చర్చ

తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ బుధవారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో 84 అంశాలతో అజెండా రూపొందించింది. అందులో ఒకటైన చాళుక్య హోటల్ స్థలం అమ్మకాన్ని తీసకుని, కాకిలెక్కలతో వైసీపీ సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం మొదలుపెట్టింది. 'తిరుపతిలో కూటమి స్కాం.. నడిరోడ్డుపై దోపిడీ' అంటూ ఓ పోస్టను వైరల్ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థలాన్ని అమ్మనీయబోమని ప్రెస్‌మీట్ పెట్టింది. దీంతో రాజకీయ రగడ మొదలైంది. వైసీపీ కార్పొరేటర్ల ద్వారా నేటి కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించేందుకు సమాయత్తమవుతున్నట్టు తెలిసింది. అంతే దీటుగా కూటమి కార్పొరేటర్లు కూడా సమాధానమిచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.



తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పక్కన నగరపాలక సంస్థకు చెందిన ఓ భవనాన్ని 1991 ఏప్రిల్ 1న శివానంద రెడ్డికి లీజు పద్ధతిన 25 ఏళ్ల కాలపరిమితికి అప్పగించారు. ఆ భవనానికి 'చాళుక్య' హోటల్‌గా పేరుపెట్టి వ్యాపారం నిర్వహించుకున్నారు. 2016 మార్చి 31న లీజు గడువు ముగియడంతో కార్పొరేషన్ స్వాధీనపరుచుకునే క్రమంలో లీజుదారుడికి పలుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. దీంతో పోలీసుల సమక్షంలో హోటల్‌కు కార్పొరేషన్ సీలు వేసింది. తనకు జీవనాధారమైన హోటల్‌ను తిరిగి ఇప్పించాలని లీజుదారుడు కోర్టును ఆశ్రయించారు. చాలాకాలంపాటు సదరు భవనం వినయోగంలో లేకుండా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల ఇరువర్గాలు రాజీపడి, కేసు విత్ డ్రా చేసుకోవడంతో సదరు స్థలాన్ని కార్పొరేషన్ సొంతం చేసుకుంది.

మేయర్ ఆమోదంతో అజెండాలో

ఏపీ మున్సిపాలిటీస్ (అక్విజేషన్ అండ్ ట్రాన్సఫర్ ఆఫ్ ఇమ్మూవబుల్ ప్రాపర్టీ) 1967 నిబంధనలు, 1955 సెక్షన్ 148 మేరకు ప్రభుత్వ అనుమతితో కార్పొరేషన్ ఆస్తులను టెండరు ద్వారా విక్రయించుకోవచ్చు. ఆమేరకే 77 సెంట్లు కలిగిన చాళుక్య హోటల్ స్థలాన్ని నిబంధనలమేరకు బహిరంగ వేలం ద్వారా విక్రయించి వచ్చిన నిధులతో తిరుపతి నగరపాలక సంస్థ పరిపాలన భవన (సిటీ ఆపరేషన్ సెంటర్ బిల్డింగ్) నిర్మాణాన్ని పూర్తిచేయాలని కార్పొరేషన్ యంత్రాంగం భావించింది. ఆ మేరకు వైసీపీకి చెందిన మేయర్ ఆమోదంతో కౌన్సిల్ అనుమతి కోసం అజెండాలో సదరు అంశాన్ని చేర్చింది. అందులో ఎక్కడా కూడా అంకణం ఎంతకు విక్రయిస్తారన్న విషయం లేదు. కానీ వైసీపీ సోషల్ మీడియాలో కాకిలెక్కలు వేసి నడిరోడ్డుపై దోపిడీ అంటూ అబద్ధపు ప్రచారం మొదలుపెట్టింది. అంకణం రూ.15లక్షలుంటే రూ.60వేలకు అమ్మేస్తున్నారంటూ ఊదరగొట్టింది.

వైసీపీ అప్పులు, తప్పుల వల్లే అమ్మకానికి..

నగరపాలక సంస్థ పరిపాలన భవనాన్ని సిటీ ఆపరేషన్ సెంటర్ బిల్డింగ్ నిర్మాణం కోసం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులతో వైసీపీ హయాంలో రూ.71 కోట్లతో టెండరు పిలిచారు. తమిళనాడుకు చెందిన ఆర్ఆర్ తులసి బిల్డర్స్ టెండరు దక్కించుకుంది. 2022 ఆగస్టు 21న అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా భూమిపూజ జరిగింది. ఆ తర్వాత బడ్జెట్ రూ94.50 కోట్లకు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులకు మ్యాచింగ్ గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు పైసా కూడా ఇవ్వలేదు. ఇంతలో స్మార్ట్ సిటీ గడువు పూర్తవడంతో కేంద్ర నిధులు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు చొరవ చూపకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ308కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ98కోట్లు కలిపి మొత్తం సుమారు రూ406కోట్లు స్మార్ట్ సిటీకి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. దీంతో తిరుపతిలో స్మార్ట్ సిటీ నిధులతో మొదలైన భారీ ప్రాజెక్టులకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి.

ఆగిన భవన పనులు

సీవోసీ బిల్డింగ్ 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు రూ16.60 కోట్లు మాత్రమే చెల్లించారు.మిగిలిన సుమారు రూ78 కోట్లను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనను కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పటివరకు చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు రూ40కోట్లు చెల్లించాలి. బకాయిలిస్తేనే పనులు మొదలుపెడతామని కాంట్రాక్టర్ పేచీ పెట్టారు. దీంతో కార్పొరేషన్ యంత్రాంగానికి ఎటూ పాలుపోక సదరు స్థలాన్ని విక్రయించాలన్న ఆలోచన కలిగింది.

వైసీపీ హయంలో కార్పొరేషన్ బడ్జెట్‌ను జీరో చేయడమేకాకుండా రూ150కోట్లకు పైగా కాంట్రాక్టర్లకు అప్పులు పెట్టారు. తమ ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ80 కోట్ల పాత అప్పులను తీర్చాల్సి వచ్చిందని కూటమి నేతలు మండిపడుతున్నారు.

మెరిడియన్ మాయాజాలం మరిచారా?

కపిలతీర్థం సర్కిల్లో 10వేల చదరపు అడుగుల్లో రూ2 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన భవనాన్ని కారుచౌకగా కొట్టేసిన వైసీపీ నాయకులకు అందరూ అలాగే కనిపిస్తుంటారని కూటమి వర్గాలు చర్చించుకుంటున్నాయి. మెరిడియన్ హోటల్ పేరిట వెలిసిన భవనానికి ఏడాదికి కోటి రూపాయలకు పైగా ఆదాయం వచ్చేది. అలాంటిది నెలకు 1.5లక్షకే అద్దెకు ఇస్తూ వైసీపీ ప్రభుత్వంలో వారి అనుచరులకు కట్టబెట్టేసిన విషయం మరిచారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. చాళుక్య హోటల్ స్థలం విక్రయానికి కౌన్సిల్ ఆమోదం పొందితే నిబంధనల మేరకు బహిరంగ వేలం జరుగుతుందని కార్పొరేషన్ యంత్రాంగం చెబుతోంది.



రెడ్ నెక్కుడు వాలాబీ (ఎర్ర మెడ గల వాలాబీ)





జూపార్కులో ఇక మరింత సందడి

● ఆగస్టులో విదేశీ వన్యప్రాణుల రాక

ఎస్వీ జూపార్కుకు మరికొన్ని వన్యప్రాణులు రానున్నాయి. సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. ముమ్మూర్తులా ఆస్ట్రేలియాలోని కంగారు జాతిని పోలి ఉండే రెండు రెడ్ నెక్డ్ వాలాబీ(ఎర్ర మెడ)లు, దక్షిణాఫ్రికాకు చెందిన రెండు మార్మోసెట్‌లు ఆగస్టులో వస్తాయని ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. ప్రస్తుతం ఈ అందాల వన్యప్రాణులు గుజరాత్ జూపార్క్‌లో ఉన్నాయి. వీటిని ఉంచేందుకు రూ.55లక్షల వ్యయంతో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేస్తున్నామని క్యూరేటర్ చెప్పారు. ఇందుకోసం టెండర్లు పిలుస్తున్నామన్నారు. వైట్ టైగర్స్ సఫారి పూర్తి కావచ్చిందన్నారు. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కాగా ఇక్కడి జూపార్కులో ఇప్పటికే 33 ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇందులో సింహాలు, బెంగాల్ టైగర్లు, ఏనుగులు, చిరుతలు, జాగ్వార్లు, నీటి ఏనుగులు, పక్షులు, అడవి దున్నలు, జింకలు, దుప్పులు, మొసళ్లు ఉన్నాయి. తిరుమలకు వచ్చే భక్తులే కాకుండా ఎస్వీ జూపార్కు సందర్శకులు సంఖ్య పెరుగుతోందని సెల్వం వివరించారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు విస్తరించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు
- సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,681
- తలనీలాలు సమర్పించినవారు: 35,261





బోర్డు మీటింగులో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు, ఈవో

సనాతన హిందూ ధర్మప్రచారం కోసం

ఏటా రూ.120 కోట్ల ఖర్చు

- చిత్తూరు జిల్లాలో 141 ఆలయాల నిర్మాణానికి ఆమోదం
- మానవీయ విలువలపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తిరుమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'సనాతన హిందూ ధర్మప్రచారం కోసం టీటీడీ ఏటా హెచ్‌డీపీపీ ద్వారా రూ.120 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల నూతన కార్యక్రమాలను ప్రారంభించేందుకు మా బోర్డు తీర్మానాలు చేసింది' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం హెచ్‌డీపీపీ విభాగంలోనూ బోర్డు సభ్యులు వివిధ అంశాలపై చర్చించారు. ఆ వివరాలను బోర్డు సభ్యులు నరేష్, పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, జానకీదేవి, శాంతారామ్, రామ్మూర్తి, సదాశివరావు, ఎక్స్‌అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డితో కలిసి బీఆర్ నాయుడు క్యాంపు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 141 నూతన ఆలయాల నిర్మాణానికి ఆర్థికసాయం కోసం ఆమోదం తెలిపామన్నారు. మిగిలిన ప్రాంతాలకు చెందిన వారూ ముందుకు వస్తే రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆలయ నిర్మాణాలకు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు కేటాయిస్తామన్నారు. దళితవాడల్లో ఆలయాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

మరికొన్ని నిర్ణయాలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని సమరసతా సేవా ఫౌండేషన్ ద్వారా తిరుపతిలోని టీటీడీ శ్వేతాకు తీసుకొచ్చి అర్చకత్వంపై శిక్షణ ఇవ్వాలని తీర్మానం. వారి ప్రాంతాల్లోని ఆలయాల్లో అర్చకత్వం చేసుకునేలా పూజా విధానాలు, వ్రతాలపై శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం.
- టీటీడీకి చెందిన ఏడు పాఠశాలల్లోని దాదాపు 1,600 మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో హైందవ సనాతన ధర్మం నేర్పిన మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వడానికి 'సద్గమయ' నిర్వహించేందుకు నిర్ణయం.
- సనాతన ధర్మం, తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడానికి 'మన వారసత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయం.
- వరలక్ష్మీ వ్రతం రోజు పద్మావతి అమ్మవారి ఆలయంలో 'సౌభాగ్యం' నిర్వహించేందుకు ఆమోదం.
- సీఎం ఆదేశాలతో టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో 21న యోగా డే నిర్వహించాలని తీర్మానం.
- ప్రకృతి పరిరక్షణకు భక్తులకు మొక్కలను అందజేసేలా 'వన-నిధి', భవిష్యత్తు తరాలకు హరికథ కళను అందించేలా 'హరికథావైభవం', యువత ద్వారా భజనలను ప్రోత్సహించేలా 'భజేశ్రీనివాసం', గిరిజన ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు 'గిరిజనార్చనం'తో పాటు అక్షరగోవిందం, భగవద్గీత అనుష్ఠాన బోధన వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం.
- న్యూఢిల్లీలో 1952లో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టీటీడీ కళాశాలను ఆధునికీకరించేందుకు ఆమోదం.
- అలిపిరి చెక్‌పాయింట్‌లోని ఆర్చిని ఆధ్యాత్మిక శోభతో కొత్తగా నిర్మించాలని తీర్మానం.

'ఎన్‌ఐసీ' పోటీ పరీక్షలు రద్దు

● మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య



మాధుర్ (ఫైల్ ఫొటో)

పుత్తూరు/పుత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌ఫార్మాటిక్స్ సెంటర్(ఎన్‌ఐసీ.. నిక్) సి- కేడర్ సైంటిస్ట్ పోస్టుల పోటీ పరీక్షను రద్దు చేయడంతో మనస్తాపానికి గురై పుత్తూరు పట్టణానికి చెందిన మాధుర్ (32) ఆత్మహత్య చేసుకున్నారు. నవీ ముంబైలోని ఎస్బీఐలో ఐటీ అధికారిగా పని చేస్తున్న ఈయన శనివారం ఉరేసుకున్నారు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేయగా, పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని పుత్తూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. 'తాను కలగన్న ఉద్యోగం దూరమైందని జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మా కొడుకుకు ఎదురైన ఇబ్బందులు మరొక్కరికి జరగకూడదు. ఎన్‌ఐసీ నోటిఫికేషన్ రద్దుపై పూర్తి స్థాయిలో జాతీయ దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరిపించాలి' అని రోదిస్తూ జార్జ్, హేమలత దంపతులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని యువతకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వయస్సు రీత్యా ఎన్‌ఐసీలో ఉద్యోగానికి చివరి అవకాశం కావడంతో ఎంతగానో తపన పడి చదివాడని అతడి చెల్లెలు హాసిక చెప్పారు.

సూసైడ్ నోట్‌లో ఏముందంటే..!

'నేను ఎంతో కష్టపడి, ఇష్టపడి నిక్ పోటీ పరీక్షలు రాశా. ఇంటర్వ్యూలో నెగ్గి 5వ ర్యాంకు సాధించా. అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాల్సిన నేపథ్యంలో ఏడాదిగా వాయిదా వేస్తూ చివరకు రద్దు చేయడం జీర్ణించుకోలేకపోయా. ఆలస్యంపై ప్రధాని, నిక్ కార్యాలయాలకు ఫిర్యాదు చేశా. చివరకు నాతో పాటూ ఎంపికైన అభ్యర్థులతో బాంబే హైకోర్టును ఆశ్రయించా. ఇలాంటి తరుణంలో ఆశావహుల ఆశల మీద నీళ్లు చల్లుతూ పరీక్షల నోటిఫికేషన్ మొత్తాన్ని నిక్ రద్దు చేసింది. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నా. పైపెచ్చు నాలాంటి యువకులకు న్యాయం కలగాలి. వ్యవస్థలలో కనువిప్పు కలగాలి. నా మరణంతో వచ్చిన డబ్బుతో మంచి పాఠశాలను పెట్టి ఆధారం లేని చురుకైన పిల్లలకు ఉచిత విద్య అందించు హాసిక(చెల్లెలు)' అంటూ మాధుర్ సూసైడ్ నోట్‌లో రాశారు.

అబ్దుల్ కలాంలా సైంటిస్టు కావాలని..

'అబ్దుల్ కలాంలా బ్రహ్మచారిగా ఉంటూ సైంటిస్టు కావాలని కలలు కనేవాడు. నిత్యం పోటీ పరీక్షలు రాస్తూ ఉన్నత లక్ష్యాలను పెట్టుకున్నాడు.శనివారం రాత్రి 10 గంటల వరకు ఫోనులో మాట్లాడాడు. ఆ మరుసటి రోజు నుంచి ఫోన్ పని చేయలేదు. ఆదివారం ఉదయం పనికి రావద్దని శనివారమే పని మనిషికి చెప్పాడంట'అంటూ మాధుర్ తల్లి హేమలత రోదిస్తూ చెప్పారు. పట్టుదలతో ఎంటెక్ సాధించి జాతీయ బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగసంస్థల్లో జనరల్ సీటుతో ఉద్యోగాలు సంపాదించాడని గుర్తుచేసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన ఎక్కువేనన్నారు. తన కుమారుడి ప్రవర్తన చూసి ముంబైలోని ఎస్బీఐ డీజీఎం స్థాయి అధికారులు దగ్గరుండి శవ పేటికను భద్రంగా చెన్నైకు విమానంలో తరలించారని తెలిపారు.

మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద

టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టండి

● యాజమాన్యానికి కలెక్టర్ వెంకటేశ్వర్ సూచన



మామిడి గుజ్జు ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యానికి సూచనలు చేస్తున్న కలెక్టర్

రేణిగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమ వద్ద యజమానులు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. రేణిగుంట మండలం ఎస్ఎస్ పురంలోని శ్రీ వర్ష ఫుడ్ పరిశ్రమలో మామిడి పండ్ల గుజ్జు తయారీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి కాయలను తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. తోతాపూరి రకం మామిడి కాపు ముగిసే వరకు పల్ప్ ఫ్యాక్టరీలు కాయలను తీసుకుంటాయన్నారు. ప్రతి పరిశ్రమ వద్ద నియమించిన అధికారులు.. రైతులు తీసుకొచ్చే మామిడి కాయల టన్నులను నమోదు చేసుకుంటారన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అందించే సబ్సిడీని ఆయా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు రైతులు తీసుకొచ్చే మామిడి కాయల వివరాలను కంప్యూటరీకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఏడీ సురేంద్రబాబు, తహసీల్దారు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కేవీబీపురంలోని దేవరాజు ఆగ్రోఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు.

తోతాపురి కొనుగోలుకు సహకరించండి: జేసీ



దామలచెరువులో వ్యాపారులు, ర్యాంపుల యజమానులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

పాకాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్‌లో మంగళవారం జేసీ శుభం బన్సల్ పర్యటించారు. తోతాపురి మామిడికాయల కొనుగోళ్లను పరిశీలించారు. రైతులు, వ్యాపారులు, ర్యాంపుల యజమానులతో మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి మామిడి కాయల కొనుగోలుకు సహకరించాలని సూచించారు. టన్నుకు ప్రభుత్వం రూ.4వేలు సబ్సిడీ ఇస్తున్న క్రమంలో గుజ్జు పరిశ్రమలు రూ.8వేలకు కొనుగోలు చేయాలన్నారు. ర్యాంపుల వద్ద టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టి కొనాలని సూచించారు పరిశ్రమల్లో మామిడి కాయలు తీసుకోవడం లేదని, రవాణాకు తగినన్ని లారీలు లేవని ర్యాంపుల యజమానులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల రవాణా సంఘాలతో చర్చించి ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలు, ర్యాంపుల వద్దకు తీసుకొచ్చిన కాయలను సకాలంలో అన్‌లోడింగ్ చేయక పోవడంతో చాలాభాగం పాడయిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రావారిపాలెం,చిన్నగొట్టిగల్లులోని మామిడి కాయల మండీలు, ర్యాంపులను జేసీ పరిశీలించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్, మండల ఉద్యాన అధికారిణి శైలజ, డీటీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



రవి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు

చెరువులో వాహనం బోల్తా

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

భాకరాపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చెరువులో టాటా సుమో బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు చిన్నగొట్టిగల్లు మండలం మారసానివారిపల్లె హరిజనవాడకు చెందిన శంకర, ప్రకాశ్, భాకరాపేటకు చెందిన రఘునాథ్, తిరుపతికి చెందిన రవి, శంకరలు టాటా సుమోలో మంగళవారం భాకరాపేట నుంచి చిన్నగొట్టిగలు బయలుదేరారు. చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై గంగమ్మ ఆలయం మలుపులో టాటా సుమో అదుపు తప్పింది. చెరువులోకి దూసుకెళ్లింది. వెనుక వస్తున్న ఓ ద్విచక్ర వాహనచోదకుడు వెంటనే స్థానికులు, పోలీసులకు సమాచారం అందించాడు. స్థానికులు, పోలీసులు క్రేన్ సాయంతో వారిని నీటి నుంచి కాపాడారు. అప్పటికే రవి(40) మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రుయా ఆసుపత్రికి తరలించారు. రవి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అతని భార్య, బంధువులు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.



గాయపడిన శంకర, రఘునాథ్, ప్రకాశ్



చెరువులో నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

---

207 మందికి టీడీఆర్ బాండ్ల పంపిణీ

తిరుపతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 207 మందికి టీడీఆర్ బాండ్లను పంపిణీ చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని చెప్పారు. అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 207మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా మంగళవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు 187 మందిని ఎంపిక చేశామని చెప్పారు. వీరందరూ గిఫ్ట్‌డీడ్ ఇచ్చిన వెంటనే టీడీఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీసీపీ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ రవాణాశాఖలో అప్రెంటీస్ కోసం

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ రవాణాశాఖలో సంవత్సర కాలం అప్రెంటిస్‌గా చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ పాసైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు, 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నెంబరు, ఈమెయిల్ ఐడీ, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను ఈ నెల 30వ తేదీ లోగా అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ సి.గంగాధరంకు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441647174 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

● లేదంటే సీజ్ చేస్తామంటున్న రవాణా అధికారులు



ఫిట్నెస్ కోసం వచ్చిన వాహనాన్ని నడిపి చూస్తున్న డీటీవో మురళీమోహన్, పక్కన డీటీసీ కృష్ణవేణి, ఎంవీఐ శ్రీనివాసరావు

తిరుపతి(రవాణా), జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్నెస్‌పై రవాణాశాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ల కోసం హాజరయ్యే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం తిరుపతి ఆర్టీఏ కార్యాలయ పరిధిలో ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన బస్సులను డీటీసీ కృష్ణవేణి, డీటీవో మురళీమోహన్ పరిశీలించారు. డీటీవో వాహనాన్ని నడిపి కండిషన్‌ను పరిశీలించారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,700 బస్సులకుపైగా ఉండగా, ఇంకా 450కిపైగా ఎఫ్‌సీ (ఫిట్నెస్ సర్టిఫికెట్) తీసుకోలేదన్నారు. ఎఫ్‌సీల గడువు ముగిసిన వెంటనే బస్సులను యధావిధిగా కండిషన్‌లో పెట్టుకుంటేనే ఆ తర్వాత సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. ఫిట్నెస్‌తో పాటు ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగే బస్సులకు జరిమానా విధించడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందని బస్సులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రత్యేకించి బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో

4 వారాంతపు ప్రత్యేక రైళ్లు మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా- తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేకరైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్భానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

గురురాజుపల్లి ఎస్టీ కాలనీపై వైసీపీ నేత కన్ను!

● హైవే పక్కన ఇళ్ల స్థలాలను కొని ఖాళీ చేయించే పన్నాగం

రేణిగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గురురాజుపల్లి ఎస్టీ కాలనీపై ఓ వైసీపీ నేత కన్ను పడింది. హైవే పక్కనున్న ఆ కాలనీలోని ఎస్టీల స్థలాలను కొని.. ఖాళీ చేయించే పన్నాగంలో ఉండటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గురురాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సుమారు 80 కుటుంబాలున్నాయి. ఈ ఎస్టీ కాలనీకి 20 ఏళ్ల కిందట శ్రీ సత్యసాయి ట్రస్ట్ తరపున ఇళ్లు, రోడ్లు నిర్మించి ఇచ్చారు. ఇటీవల ఆరు లేన్ల నేషనల్ హైవే రావడంతో కాలనీలోని సగం ఇళ్లు రోడ్డుకు పోయాయి. మిగిలిన కాలనీలో ఎస్టీలు రోడ్డు నష్టపరిహారంతో ఇళ్లు నిర్మించుకొని హైవే పక్కన జీవనం సాగిస్తున్నారు. హైవే పక్కనే ఉండటంతో ఈ కాలనీలోని స్థలాలకు మార్కెట్‌లో రూ.కోట్లలో విలువ ఉంది. దీంతో ఆ స్థలాన్ని సొంతం చేసుకునేలా ఓ వైసీపీ నేత స్కెచ్ వేశారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే మద్యం, డబ్బు ఎర చూపి 15 ఇళ్లను అతి తక్కువ ధరకు కొన్నారని సమాచారం. వీరందరినీ బలవంతంగా ఇటీవల ఖాళీ చేయించారన్న ఆరోపణలున్నాయి. దీంతో తమనూ బలవంతంగా ఖాళీ చేయిస్తారా అన్న ఆందోళన మిగిలిన ఎస్టీల్లో మొదలైంది. తమ కాలనీలో మిగిలిన ఇళ్లను ఆ వైసీపీ నేత బలవంతంగా కొనకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, రోడ్డు విస్తీర్ణానికి నష్టపోయిన ఎస్టీ కుటుంబాలకు గురువరాజు పల్లి సమీపంలోని డీకేటీ భూముల్లో మూడు సెంట్ల లెక్కన కేటాయించనున్నారు. దీంతో ఆ భూములు బాధితులకు కేటాయించక ముందే ఎస్టీ కాలనీవాసులకు అడ్వాన్సుల రూపంలో డబ్బులు చెల్లించి వాటిని దక్కించుకోవాలని చూస్తున్నారని సమాచారం. వీటిపై అధికారులు విచారణ జరపాల్సి ఉంది.



నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న ఎస్టీ కాలనీ

తీరప్రాంత గ్రామాల్లో తాగునీటికి కటకట

పైపు లైన్ మరమ్మతులతో తరచూ సమస్యలు ● గ్రామాలకు సక్రమంగా అందని మంచినీళ్లు

వాకాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వాకాడు స్వర్ణముఖినది తీరం వద్ద రక్షిత మంచినీటి పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 18 సంవత్సరాల క్రితం నిర్మించిన పైపు లైన్లు తరచూ పగిలిపోతున్నాయి. గత వారం రోజులకు పైగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. దుగరాజ పట్నం పంచాయతీలోని కొండూరుపాళెం, అంజనాపురం, కొత్తూరు గ్రామాలకు, తూపిలిపాళెంలోని 2వేల కుటుంబాలకు, గంగన్నపాళెం, తిరుమూరు పంచాయతీలో వావిళ్లపాళెం, చీమలపాడు, కల్లూరు, కోడివాక పంచాయతీల ప్రజల దాహార్తి వర్ణణాతీతంగా ఉంది. ఇక్కడ పైపులైన్ పగిలిపోయి ఆరు రోజులు దాటినా మరమ్మతులు చేపట్టలేదు. ఇదిలా ఉండగా ఆయా పంచాయతీల్లో సుమారు 180 చేతిపంపులు ఉండగా, 25 మాత్రమే పనిచేస్తున్నాయి. గ్రామాల్లో ఉన్న చేతి పంపులను బాగుచేస్తే పైపు లైన్‌లు మరమ్మతులకు గురైనప్పుడు వినియోగించుకోవచ్చని, కానీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నందకుమార్



దుగరాజపట్నం కొత్తూరులో ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

వివరణ కోరగా తాగునీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

యోగాతో మానసిక ఉల్లాసం


యోగాసనాలు వేస్తున్న షార్ డైరెక్టర్, ఆర్డీవో కిరణ్మయి, ఉద్యోగులు

సూళ్లూరుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. మంగళవారం షార్‌లోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా షార్ డైరెక్టర్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, షార్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రాజరాజన్ మాట్లాడుతూ.. ప్రాచీన భారతదేశం అందించిన అమూల్యమైన బహుమతి యోగా అన్నారు. యోగాసనాలతో శారీరక, మానసిక దృఢత్వం సాధించవచ్చన్నారు. మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతామన్నారు. ఆర్డీవో కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని, దీని వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, షార్ ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి షార్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో స్నానానికి దిగి వృద్ధుడి మృతి


బాలాజీ మృతదేహం

వెంకటగిరి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేటకు చెందిన సత్తల బాలాజీ (65) తెలుగంగ లింకు కాలువలో స్నానానికి వెళ్లి మృతి చెందాడని ఏఎస్ఐ రమణయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. బంగారుపేటకు చెందిన సత్తల బాలాజీ సోమవారం సాయంత్రం తెలుగంగ లింకు కాలువలో స్నానానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం కాలువలో బాలాజీ మృతదేహం లభ్యమయ్యింది. పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

నక్కలోళ్లకు పునరావాసం కల్పించడానికి చర్యలు


అజెండాలోని అంశాలను వివరిస్తున్న మున్సిపల్ ఉద్యోగి రవి, వేదికపై చైర్ పర్సన్ కటకం దీపిక, కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంతంలో రోడ్డు డివైడర్లపై నివాసాలు ఏర్పరుచుకున్న నక్కలోళ్లకు పునరావాసం కల్పిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవీఎస్ ఆస్పత్రి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నక్కలోళ్ల నివాసాల కోసం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం రూ.18.5 కోట్లతో అంచనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అన్న క్యాంటీన్ పక్కన మున్సిపాలిటీ స్థలంలో ఉన్న విగ్రహాలకు ఫ్లోరింగ్ ఏర్పాటుకు, అలాగే పార్కు నుంచి అగ్రహారపేట వరకు గుంతలమయమైన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.10లక్షలతో స్టోన్‌డస్ట్‌తో మరమ్మతులు చేసేందుకు కౌన్సిల్ ఆమోదాన్ని కోరారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో గత మూడుళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా, అదే ప్రాంతంలో మళ్లీ కొత్త పనుల ఆమోదాన్ని కోరడం పట్ల కోఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్, కౌన్సిలర్ చంద్రారెడ్డి అభ్యంతరం తెలిపారు. పాత బిల్లులను చెల్లించి కొత్త పనులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, మేనేజర్ ఉరుకుందమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రకృతి జీవన విధానంతో పరిపూర్ణ ఆరోగ్యం


ప్రకృతి జీవన విధానంపై బోచర్ ఆవిష్కరిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు, ఆర్డీవో కిరణ్మయి తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పరిపూర్ణ ఆరోగ్యానికి ప్రకృతి జీవన విధానం అవసరమని ప్రముఖ ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు అన్నారు. సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో మంగళవారం ప్రకృతి జీవన విధానంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూతాలతో కూడిన అందమైన ప్రకృతి అనంత కోటి జీవరాసులకు ఆధారభూతమన్నారు. మానవాళి మనుగడకు ప్రకృతి జీవన విధానం ఎంతో ముడిపడి ఉండేదని, నేడు ప్రకృతి నియమాలను వదిలేయడంతో ప్రజల రోగాల బారినపడుతున్నారన్నారు. ప్రకృతిని కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ప్రకృతి - పర్యావరణం అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ముందుగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జ్యోతి ప్రజ్వళన చేసి సదస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఆర్డీవో కిరణ్మయి, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఆటో ఏర్పాటు చేశాం

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



ప్రభుత్వ బడిలో సౌకర్యాల గురించి కల్లూరుకొత్తపాళెం వద్ద తల్లిదండ్రులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు రమణయ్య, శ్రీనివాసులు

వాకాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు ఉచితంగా ఆటో ఏర్పాటు చేశాం, పిల్లలను ముట్టెంబాక మోడల్ ప్రైమరీ స్కూల్‌కు పంపాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. మంగళవారం ముట్టెంబాక మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తానయ్య, ఉపాధ్యాయులు టీవీ రమణయ్య, టి.శ్రీనివాసులు కల్లూరు, దుర్గవరం, కోడివాక, వడ్డిపాళెం, కల్లూరుకొత్తపాళెం గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకం ద్వారా నగదు పంపిణీ, ఆటపాటలతో కూడిన బోధన అందిస్తామని వివరించారు. ప్రతిరోజు విద్యార్థుల రాకపోకల కోసం ఉచితంగా ఆటో ఏర్పాటు చేశామని చెప్పారు. పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయులు తమ ఇళ్ల వద్దకే వచ్చి అడగడంతో 16 మందికి పైగా విద్యార్థులు ముట్టెంబాక పాఠశాలలో చేరారు.

గిరిజనులు సాగు చేస్తున్న భూములకు హక్కులు: కురుగొండ్ల


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గిరిజనులు సాగు చేసుకొంటున్న అటవీ భూములకు హక్కుల కల్పిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలో ఆదర్శ గ్రామంగా ఎంపికైన కందలవారిపల్లి గిరిజన గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కందలవారిపల్లి గిరిజనులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకొంటున్న అటవీ భూముల విషయంలో వైసీపీ నాయకులు తమను ఇబ్బంది పెడుతున్నారని గిరిజనులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. కందలవారిపల్లి గిరిజన కాలనీని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేయడం వల్ల ఇక్కడ అన్ని మౌళిక వసతులు కల్పిస్తామని చెప్పారు. గిరిజన కాలనీల్లో రోడ్లు, డ్రైన్‌లు, పక్కాగృహాలు, అంగన్‌వాడీ భవనం, మెరుగైన విద్యుత్ సౌకర్యం వంటి వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఎంఈవో జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

తడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించిందన్న మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన అచ్చిరెడ్డి చెంగయ్య(36) మాంబట్టు సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు. కొద్ది రోజులుగా విధులకు హాజరు కాకుండా ఇంటి వద్దే ఉంటుండడంతో సోమవారం భార్య మందలించింది. మనస్తాపం చెందిన చెంగయ్య పురుగుల మందు డబ్బా తీసుకొని పొలాల్లోకి వెళ్లి తాగేశాడు. వెంటనే కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెన్నుపోటుపై జగన్‌కు పేటెంట్: టీడీపీ


సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు వెన్నుపోటుపై పేటెంట్ ఇవ్వొచ్చని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సొంత బాబాయిని గొడ్డలి వేటుతో అంతం చేసింది, ఆస్తిలో వాటా, రాజకీయంగా పదవులు ఇవ్వాల్సివస్తుందని సొంత చెల్లికి వెన్నుపోటు పొడిచింది జగనేనని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులతో అధోగతిపాలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరగనట్లు ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడడం దుర్మార్గమన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి నగదు అందజేసిన ఘనత సీఎం చంద్ర బాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ కల్లబొల్లి మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. సమావేశంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, వెంకటేశ్వర్లురాజు, ఇశ్రాయిల్ కుమార్, వేముల సునీల్, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాలలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేడయం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిపుష్టి కలిగి ప్రశాతమైన జీవనం గడపవచ్చన్నారు. అనంతరం యోగా మీద గేయం రాసిన అర్థశాస్త్ర అధ్యాపకుడు పీరకుమార్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో విజయ మహేష్, నారాయణరాజు, శ్రీధర్‌శర్మ, యూన్సీ వాణి, శైలజ, కిరణ్మయి, కృపాకరుణవాణి, లక్ష్మీ, రవిరాజు, హిమబిందు, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలగొట్టి రూ.లక్ష చోరీ

నాయుడుపేట కోర్టు ప్రాంగణంలో ఘటన

నాయుడుపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో లక్ష రూపాయలు చోరీకి గురైనట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. తిరుపతి రూరల్ ప్రాంతానికి చెందిన న్యాయవాది రాజమాణిక్యం తిరుపతి కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం తన వెంట తెచ్చుకున్న రూ.లక్ష కారులో భద్రపరిచి కోర్టులోకి వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి కారు అద్దాలు పగలగొట్టి ఉన్నాయి. అందులోని నగదు కనిపించలేదు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణమ్మ

చిల్లకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలను త్వరిగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వెంకటరమణమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో పాఠశాలల విలీనం ప్రక్రియ జరుగుతోందని, దీంతో విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను అక్కడే కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ మన్నెం శీనయ్య, వైస్ ఎంపీపీలు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, చెంగయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

బటన్ నొక్కుడుతో చతికిలపడ్డాం: వైసీపీ

ఓజిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కుడుకు ప్రాధాన్యం ఇచ్చి పార్టీ నాయకులను విస్మరించారని వైసీపీ నేతలు అన్నారు. ఓజిలిలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ మండల కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి అధ్వర్యంలో 'జగనంటే నమ్మకం - చంద్రబాబు మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ రఘురామరాజు మాట్లాడుతూ బటన్ నొక్కుడుకు ప్రాధాన్యం ఇచ్చిన జగన్‌ను.. ప్రజలు కూడా బటన్ నొక్కి ఇంటికి పంపారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ ఎన్నికల హామీలు అమలు చేయకుండా వాయిదాలు వేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా ప్రజలకు అందేవరకు నిరసన తెలుపుతూనే ఉంటామని వైసీపీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ, వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండూరు వెంకటసుబ్బరాజు, నాయకులు దామోదర రాజు, సర్పంచులు ప్రభాకర్‌రాజు, సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచి ముమ్మడి రామయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

చిల్లకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి విద్యానికేతన్ కళాశాలలో మంగళవారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శశికళ, నరేష్, రజిని జైన్, రాజేంద్రకుమార్, మురళీకృష్ణారెడ్డి, లక్ష్మి, జాఫర్, అలీ, రజినీకాంత్, బాబారావు, అనసూయమ్మ, సంగీతమ్మ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట తహసీల్దారుగా గోపీనాథరెడ్డి



సూళ్లూరుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా నాయుడుపేట సీఎస్ డీటీగా పనిచేస్తున్న గోపీనాథరెడ్డిని నియమించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఎస్వీ నరసింహారావును వెంకటగిరికి బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తాగునీటి సరఫరాలో అంతరాయం

గూడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒకటి, రెండో పట్టణాల్లో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. కండలేరు నుంచి వేములపాళెం వాటర్ ప్లాంటుకు వచ్చే పైపులైన్ పలుచోట్ల దెబ్బతినడంతో మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

చిట్టమూరు తహసీల్దారుగా సతీష్ కుమార్



చిట్టమూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు తహసీల్దారుగా సతీష్ కుమార్‌ను నియమిస్తూ మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన రెండు నెలల క్రితం వెంకటగిరి నుంచి ఇక్కడకు ఇన్‌చార్జి తహసీల్దారుగా వచ్చారు. ఇప్పుడు రెగ్యులర్ తహసీల్దారు నియమితులయ్యారు.

మెరుగైన బోధనతో పాటు ఉపాధి అవకాశాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

గూడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఆదిశంకర విద్యాసంస్థ చైర్మన్ వంకి పెంచలయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు పలు బహుళజాతి కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సత్యేంద్రబసాల్, బినీత్ కుమార్, కళాశాల వైస్‌చైర్ పర్సన్ అనూష, డైరెక్టర్ డాక్టర్ రాజామురగదాస్, వేణుమాధవ్, శ్రీనివాస్, అర్చన, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో జ్యోతికిరణ్

సూళ్లూరుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీవో జ్యోతికిరణ్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు పెడుతున్న పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్య గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనీషా సింగ్, అంగన్‌వాడీ వర్కర్ సుభాషిణి పాల్గొన్నారు.

పెళ్లకూరు తహసీల్దారు బదిలీ

పెళ్లకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ద్వారకనాథరెడ్డి బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సీహెచ్ హరికృష్ణ ఇక్కడకు తహసీల్దార్‌గా రానున్నారు.

నేడు వెంకటగిరి మండల సమావేశం

వెంకటగిరి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి) మండలసర్వసభ్య సమావేశం ఎంపీపీ తనూజారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం పదిన్నర నిమిషాలకు జరుగుతుందని ఎంపీడీఓ గుణశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు.

25న బాలయపల్లి మండల మీట్

బాలయపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బాలయపల్లి వెలుగు కార్యాలయంలో ఈ నెల 25వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించండి

గూడూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లిచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ మెడికల్ శానిటేషన్ కాంట్రాక్ట్ యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఏరియా ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా జీతాలను చెల్లించాలన్నారు. అనంతరం ఏపీ మెడికల్ శానిటేషన్ కాంట్రాక్ట్ యూనియన్ కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శశికుమార్, నారాయణ, మస్తానయ్య, చెంగమ్మ, సెల్వి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గూడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పెందుర్తి నియోజకవర్గం యోగాంధ్ర అబ్జర్వర్, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారని. అందరం కలిసికట్టుగా విజయవంతం చేసేందుకు కృషిచేయాలని కోరారు.

మాజీ జడ్పీటీసీకి ఎమ్మెల్యే కురుగొండ్ల పరామర్శ

డక్కిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న డక్కిలి మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్యను ఎమ్మెల్యే కురుగొండ్ల పరామర్శించారు. మంగళవారం దేవుని వెల్లంపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి రామచంద్రయ్యను పరామర్శించారు.

'తల్లికి వందనం' అర్హులందరికీ ఇవ్వాలి

పెళ్లకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఎన్‌సీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం చిల్లకూరులో వారు మాట్లాడుతూ మండలంలో ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఓబ్బు వెంకటరత్నం, ఎంపీటీసీ కన్నలి కుమార్, నాయకులు కట్టా బాలసుబ్రహ్మణ్యం, ఎల్లు మోహన్, కుమారి వీరకుమార్, అట్ల కృష్ణయ్య, చక్రపాణి, మునిరాజ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల తనిఖీ

కోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట, విద్యానగర్‌లో గల ప్రైవేట్ పాఠశాలల బస్సులను మంగళవారం వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ తనిఖీ చేశారు. బస్సుల కండిషన్, పర్మిట్‌లు, డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించి యాజమాన్యాలకు సూచనలు చేశారు.

భూ సమస్యలను పరిష్కరించండి

కోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు తహసీల్దారు జయజయరావుకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌కుమార్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకయ్యగౌడ్ పాల్గొన్నారు.

కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి

దొరవారిసత్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు రాహుల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చంద్రబాబుది వెన్నుపోటు పాలన పోస్టర్స్ ఆవిష్కరించారు. మునస్వామి నాయుడు, సురేష్‌రెడ్డి, రాజగోపాల్, దయాకర్‌రెడ్డి, వేమురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

పెళ్లకూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు గ్రామంలో మంగళవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఆదివారం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ ప్రతి రోజు ఉదయం అంబళ్లను నైవేద్యంగా సమర్పిస్తున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారి కలశాలను మహిళలు నెత్తిమీద పెట్టుకుని మంగళవాయిద్యాలు తప్పెట్లు నడుమ నృత్యాలు చేస్తూ గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం మహిళలు పొంగళ్లపెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


పొంగళ్లు నెత్తిమీద పెట్టుకొని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సూళ్లూరుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో అయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. కూటమి ఏడాది పాలనపై వెన్నుపోటు పేరుతో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, మండల కార్యదర్శి వాకాటి బాబురెడ్డి, అలవల సురేష్, జెట్టి వేణుయాదవ్, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.